వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 1
సెప్టెంబర్ 15-30, 2003

సమతా పబ్లికేషన్స్ ప్రచురణ

పేజీలు: 24
వెల: రూ.5-00

లోపలి పేజీల్లో...

వార్షిక చందా రూ॥ 120/-లు

సంపాదకీయం:

నేరమయ రాజకీయాలు - కొత్త జ్ఞానోదయం!

తెలుగుదేశం ఇంట్లో, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇవాళే కోడికూసింది. ఎంత రభస! తమకు నిన్నటివరకు నేరమయ రాజకీయాలే తెలియనట్లు ఇవాళే జ్ఞానోదయం అయినట్లు ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే కాదు అన్ని రాజకీయ పక్షాలు స్టాంపుల కుంభకోణం అవినీతి గురించి ఎక్కడలేని ఆశ్చర్యాన్ని, ఆగ్రహాన్ని నటిస్తున్నాయి. 50 సంవత్సరాలుగా కోట్ల రూపాయల ప్రజాధనం, ప్రజల నెత్తురు, చెమట కొందరు రాజకీయ నాయకులు, పెత్తందార్లు, అధికారులు కైంకర్యం చేస్తుంటే, ఏమీ పట్టనట్లు చూస్తున్నవాళ్ళు ఆ తిలాపాపంలో తలా పిడికెడు పంచుకున్నవాళ్ళే. ఇవాళ గంభీరమైన ప్రకటనలు చేస్తున్నారు. అసలు రహస్యం ఏమిటంటే భోఫోర్సు శతఘ్నుల్లోనో, యూరియాలోనో, ఏలేరు కాలువలోనో, శవాల పెట్టెల్లోనో దేశాన్ని, రాష్ట్రాన్ని అమ్మడంలోనో కోట్లు మాయం అయిపోతే ఏమీ ఫరవాలేదు అది ప్రజల సంపద. స్టాంపులు నకిలీవైపోయాయంటే మాత్రం వ్యక్తిగత ఆస్తికి. ఎసరు. ఇకనుంచి ఎవరి ఆస్తి ఎవరిదో ఆ ఆస్తి తనదని చెప్పే కాగితం అసలుదో, నకిలీదో తెలియని సొంత ఆస్తిని దెబ్బతీసే వ్యవహారం ఇది. అందువల్ల ఆస్తిపరవర్గాలన్నీ తలకిందులైపోతున్నాయి. నగరంచుట్టూ లక్షలఎకరాలు ఆక్రమించి బినామీపేర్లతో రిజిష్టరుచేసుకుని కూర్చున్న ఆసాములందరూ ఆ కాగితాలు నకిలీవి కాబోలునని తబ్బిబ్బవుతున్నారు. లేకపోతే నగరంలోనూ, చుట్టుపట్ల రియల్ ఎస్టేట్ లావాదేవీలతో సంబంధం ఉన్న మంత్రులు, ఎం.ఎల్.ఎ.లు, ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులు స్టాంపుల కుంభకోణం గురించి ఇంత అతలాకుతలం అయిపోవడం దేనికి?

నిజానికిది దేశద్రోహం. ఒక చిన్న కరపత్రం ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వేస్తే రాజద్రోహంగా నమోదు చేయాలని చెప్పే చట్టం ప్రభుత్వ అధికారానికి చిహ్నమైన స్టాంపు పేపర్లను సవాలుచేసే నకిలీని సృష్టిస్తే రాజద్రోహం అవదు. దేశద్రోహం అవదు. తమ గుంపులోదే అయినా ఒక గొర్రె కొంచెం పక్కకు వెళ్లినప్పుడు అదిలించినట్లు అదిలిస్తుంది. ఆ అదిలింపు ఈసారి కొంచెం హెచ్చుస్థాయిలో కనబడడం ఎందువల్లనంటే రకరకాల కారణాల వల్ల హైద్రాబాద్ మీద ప్రపంచ పెట్టుబడి కన్ను ఉన్నందువల్ల. హైద్రాబాద్ రియల్ ఎస్టేట్‌ను ఆక్రమించడానికి రకరకాల వ్యాపారులు పోటీపడుతున్నందువల్ల. ఈ నకిలీ స్టాంపుల కుంభకోణం వాళ్ల విశ్వసనీతయను దెబ్బతీస్తుందేమోనని మన పాలకుల భయం.

ప్రభుత్వానికి జెండాతో, కరెన్సీతో, స్టాంపు పేపర్స్‌తో సంక్రమించే సార్వభౌమాధికారం అంతిమంగా ప్రజలదేనని ప్రజలు తమ సార్వభౌమాధికారాన్ని అమలుచేసే ప్రతినిధిగా మాత్రమే ప్రభుత్వాన్ని నియమిస్తారని రాజనీతి శాస్త్రం చెబుతుంది. తమ సార్వభౌమాధికారాన్ని, తమసంపదలను కొల్లగొట్టే ఇటువంటి కుంభకోణాలకు ముగింపు పలకడానికి ప్రజలు లేచి నిలిచినపుడు మాత్రమే నేరమయ రాజకీయాలు సమసిపోతాయి.

ప్రజాపక్ష సమీక్ష పేరు 'వీక్షణం'గా మార్చబడిందని తెలియజేస్తున్నాం - సం.

ఆంధ్రదేశంలో రుణం చెల్లింపుల ధోరణులు

	ద్రవ్యలోటు	మొత్తం రుణభారం	సగటు వడ్డీరేటు
1980-81	222.69	74.76	6.08
1981-82	243.65	182.46	5.92
1982-83	172.38	395.00	6.53
1983-84	493.02	106.25	6.88
1984-85	591.40	203.48	9.03
1985-86	435.29	241.24	8.49
1986-87	803.27	102.52	9.06
1987-88	567.29	172.45	10.17
1988-89	671.86	91.50	11.18
1989-90	971.58	74.87	-
1990-91	967.07	83.49	1157
1991-92	1135.32	95.96	12.31
1992-93	1569.29	69.24	12.62
1993-94	1833.19	73.88	13.10
1994-95	2348.52	85.29	13.56
1995-96	2416.81	135.94	14.00
1996-97	2811.53	158.45	14.86
1997-98	2427.76	246.21	14.78
1998-99	5705.57	156.29	14.83
1999-00	971.58	1195.06	15.19
2000-01	7305.85	200.43	15.16
2001-02	6723.12	266.36	16.84
2002-03 (R)	7341.39	176.17	-
Average	1388.81	144.70	-

మూలం: బడ్జెట్ పుస్తకాలు

తెచ్చిన రుణం చెల్లింపు ధోరణులు

(కోట్ల రూ॥లలో)

	చేసిన రుణం	చెల్లించిన రుణం	నికర రుణం	చేసిన అప్పులో తీర్చిన అప్పుశాతం
1980-81	256.67	93.99	162.68	36.62
1981-82	517.95	347.70	170.25	67.13
1982-83	803.10	568.75	324.35	70.82
1983-84	679.40	400.79	278.61	58.99
1984-85	1466.11	1049.53	416.58	71.59
1985-86	1358.86	859.01	499.85	63.22
1986-87	938.18	527.9	410.28	56.27
1987-88	1098.52	665.41	433.11	60.57
1988-89	756.38	241.96	514.42	31.99
1989-90	898.73	256.45	642.28	28.53
1990-91	1069.93	217.88	852.05	20.36
1991-92	1441.97	394.45	1047.52	27.35
1992-93	1412.74	256.73	1156.01	18.17
1993-94	1956.16	329.43	1626.74	16.84
1994-95	2461.90	746.69	1715.21	30.33
1995-96	3650.45	1756.42	1894.03	48.12
1996-97	4429.08	2616.16	1812.92	59.07
1997-98	6232.40	3824.21	2408.19	61.36
1998-99	9875.30	6273.61	3601.69	63.53
1999-00	13165.11	8449.57	4715.54	64.18
2000-01	15.097.56	10773.18	4324.38	71.36
2001-02	18608.19	13232.63	5375.56	71.11
2002-03 (R)	12069.15	6876.67	5192.48	56.98

మూలం: బడ్జెట్ పుస్తకాలు

ఎక్కువ కార్లు అమ్మితే అది దేశాభివృద్ధా?

దేశం అభివృద్ధి చెందుతుందనడానికి కొలబద్దలేమిటి? తిండి గింజల ఉత్పత్తి పెరగడమా? ప్రభుత్వ ఆదాయం పెరగడమా? ద్రవ్యోల్బణం అదుపులో వుండడమా? అబ్బే, ఇవేమీకాదు. కార్ల అమ్మకాలు పెరుగుతున్నాయా లేదా అనేది గీటురాయి. రోజూ పత్రికలు చదువుతుంటే సామాన్యునికి కలిగే అభిప్రాయం ఇది. కార్లకు పట్టణాల్లో గిరాకీ తగ్గి, జిల్లాల్లో పెరిగిందని, మొత్తంమీద అమ్మకాల జోరు తగ్గిందని, మారుతీకార్ల అమ్మకాలు పెరుగుతున్నాయని, విదేశీ కార్లకు గిరాకీ పెరిగిందని, ఇలా చాల తరచుగా ఏదో వార్త ప్రతీరోజూ వెలువడుతున్నాయి. అక్కడకు కార్ల అమ్మకం పెరిగితే, దేశ ఆర్థిక పరిస్థితి బాగుపడిపోయినట్లు! ఈవార్తలన్నింటిలో సామాన్యులు ప్రయాణించే బస్సుల తయారీ గురించిన వార్త కనపడదెందుకో? ఇంకో ప్రశ్న. రైతులకు రుణాలివ్వటం గురించి ఇటు అటూ ఊగిసలాడే బ్యాంకులు, కార్లకు రుణాలివ్వడానికి ఎంతో ఉత్సాహం చూపిస్తున్నాయెందుకో? అలాగే విదేశాల ఫర్నీచర్ అమ్మే షోరూమ్‌లు తామరతంపరగా వెలుస్తున్నాయి. ఈ ధోరణులు చూస్తుంటే మనం ఎటువంటి ఆర్థిక సమాజాన్ని రూపొందిస్తున్నామో తెలిసిపోతుంది. కార్లు ఉన్నతవర్గాల అవసరాలైతే, మధ్యతరగతి గృహస్తునికి ఓ ఇల్లు కట్టించుకోవాలని, ఓ స్కూటర్ కొనుక్కోవాలనే కోరికను తీర్చటానికి బ్యాంకులు పోటీపడి మరీ రుణాలిస్తున్నాయి. రెండోపక్క వ్యవసాయం, చిన్న పరిశ్రమలు చిన్న వ్యాపారస్తులకు రుణాలివ్వటానికి ప్రాధాన్యతా రంగానికిచ్చే రుణాలశాతం తగ్గిపోతోంది. కార్పొరేట్లు లక్షకోట్లకు పైగా రుణాలు బాకీపడినా, ఇంకా ఎక్కువ రుణాలు తీసుకోవటం లేదని ఆందోళనపడే బ్యాంకులు, ఎవరినైతే దృష్టిలో ఉంచుకొని బ్యాంకులను జాతీయం చేశారో ఆ రైతాంగాన్ని, ఆ పేదలకు రుణాలివ్వడానికి చేతులు రావు. బ్యాంకులను ప్రైవేటీకరించకపోయి వుండవచ్చు గాక, కాని బోర్డు జాతీయం, పని ప్రైవేటు.

* * * *

సంస్కరణలు అమలుచేయడం ప్రారంభించిన తరువాత రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు కుప్పతెప్పలుగా వచ్చి పడుతున్నాయన్న భ్రమలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది. విదేశీ పెట్టుబడులకు మంజూరు చేయటం వేరు, ఆ పెట్టుబడితో పరిశ్రమలు స్థాపించి పని ప్రారంభించటం వేరు. సంస్కరణలను అమలుపరచటంలో నెంబర్‌వన్ రాష్ట్రంగా ఖ్యాతిగడించిన ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల విషయంలో మాత్రం నెంబర్‌వన్ కాదని రాష్ట్ర గణాంకాలే తెలియచేస్తున్నాయి. ఆగస్టు 91 నుంచి జూన్ 02 మధ్యకాలంలో మంజూరు చేసిన పరిశ్రమల సంఖ్య, వాటిలో వస్తాయనుకున్న పెట్టుబడులు గణాంకాల ప్రకారం దేశంలో మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, గుజరాత్ అదేవరసలో అగ్రభాగాన వున్నాయి (మంజూరు మాత్రమే). మహారాష్ట్ర రూ. 48722 కోట్లు పెట్టుబడిని (17 శాతం) ఆకర్షించగా, ఆంధ్రప్రదేశ్ రూ. 13092 కోట్లు (4.65 శాతం) మాత్రమే ఆకర్షించింది. తమిళనాడు, కర్నాటక ఆంధ్రకన్న ఎక్కువగానే ఆకర్షించాయి. వివరాలు కిందపట్టికలో చూడవచ్చు.

మంజూరైన	మంజూరైన పరిశ్రమల	మొత్తంలో మొత్తం (కోట్ల రూ.)	శాతం
మహారాష్ట్ర	4032	48722	17.32
ఢిల్లీ	1990	33807	12.02
తమిళనాడు	2165	23470	8.34
కర్నాటక	1973	21945	7.80
గుజరాత్	1050	18453	6.56
ఆంధ్రప్రదేశ్	1017	13092	4.65
మధ్యప్రదేశ్	225	9227	3.28
పశ్చిమ బెంగాల్	594	8808	3.13
ఒరిస్సా	136	8229	2.92
ఇతర రాష్ట్రాలు	8932	95579	33.38
	22084	281334	100.00

మూలం: ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ 23, డిసెంబర్ 02

* * * *

స్వదేశీ ప్రియులకు ఓ సంతోషకరమైన వార్త. మన ఇళ్ళల్లో బిస్కట్లు, కేకులు, బ్రెడ్ ఏం తిన్నా అవి బ్రిటానియా బహుళజాతి సంస్థలే. కాని మనదేశానికి పరిమితమై చూస్తే మనదేశంలోని పార్లే కంపెనీ బిస్కట్లే 18 కోట్ల కిలోలు ఖర్చువుతున్నాయి. ఇలాగే ఇటలీ, ఆస్ట్రేలియా, చైనా, బ్రిటన్ దేశాల్లోని స్వదేశీకంపెనీల బిస్కట్లే ఎక్కువ డిమాండులో ఉన్నాయి. పార్లే బ్రాండు బిస్కత్తు అధికంగా అమ్ముడుపోవటానికి వాటిధర పేద మధ్యతరగతి వారికి అందుబాటులో వుండడమే. 60 సంవత్సరాల బట్టి దేశంలో తయారై అమ్ముడుపోవటంతో వినిమయదారులకు దగ్గరచుట్టమైంది. ఒక విశేషమేమంటే భారతీయులు అమెరికాతో పోల్చిచూస్తే బిస్కట్లు చాలా తక్కువగానే తింటారు. అమెరికాలో మనదేశంలోలాగ చిల్లరతిళ్ళు వుండవు కాబట్టి, బిస్కట్ వారికి ఆహారం. అందుచేతనే సంవత్సరానికి తలసరి వినిమయం నాలుగు కిలోలు, మనం అరకిలో కన్నా తక్కువే. ప్రపంచంలోని బిస్కత్ బ్రాండ్‌లలో పార్లే నెంబర్‌వన్ బ్రాండ్. దేశంలో ఇతర వినిమయ వస్తువులు తయారుచేసే మీసం మెలేసిన కంపెనీలు 91లో సంస్కరణలు ప్రారంభించదంతోనే బహుళజాతి కంపెనీలకు పాదాక్రాంతమైపోగా, పార్లే పోటీనితట్టుకొని నిలబడింది. ఆ కంపెనీకివే జేజేలు. ○

స్టాంపుల కుంభకోణం - మేడిపండు రాజకీయాలు

— ఇప్ప వీరారెడ్డి

ఎన్నికలు, చట్టసభలు సుపరిపాలనా వ్యవస్థలాంటి బరువైన పదాల వెలుగుజిలుగులతో కీర్తించబడుతున్న భారత ప్రజాస్వామ్యం అవిరామంగా భంగపడుతూనే ఉంది. ఇది ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న ప్రభువుల స్వామ్యమని, దళారుల స్వామ్యమని, అధికారుల స్వామ్యమని మొత్తంగా అవినీతిపరుల స్వామ్యమని స్టాంపుల కుంభకోణంతో మరోసారి రుజువైంది..

32 వేలకోట్ల రూపాయలవిలువచేసే స్టాంపుల కుంభకోణం వ్యవహారంపై గత 15 రోజులుగా అన్ని దినపత్రికలు అన్నికోణాల నుండి సమగ్రమైన వివరాలను ధారావాహికంగా ప్రకటించడంపై దేశంలోని వామపక్షేతర యావత్ రాజకీయపార్టీలన్నీ కలవరపడు తున్నాయి. తమతమ కలవరపాటును బయటపడనీయకుండా ఎక్కడి వారక్కడ ఈ అవినీతి నేర వ్యవహారానికి బాధ్యత నీదంటే నీదని, ఒకరిపై ఒకరు వాడిగావేడిగా వాగ్బాణాలను విమర్శ నాస్త్రాలను సంధించుకుంటు న్నారు. పైకి ఎంత గంభీరత్వాన్ని ప్రదర్శిస్తున్నా 'గుమ్మడికాయుల దొంగంటే భుజాలు తడుము కున్నట్లు'గా తమపార్టీ నాయకులంతా కడిగిన ముత్యాలని, మచ్చలేని చంద్రులనే రీతిలో ప్రజల్ని నమ్మించాలని ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఆరాటాన్ని, ఆర్భాటాన్ని, ఆతృతను ప్రదర్శిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల ముసుగులో ప్రజాస్వామ్యం వేదికమీద వీళ్ళు కొనసాగిస్తున్న నేరమయరాజకీయాలు 'మిలమిల మెరిసే మేడిపండు'కు ఏ మాత్రం తీసిపోవు.

రాజకీయ, ఉద్యోగ అధికార వ్యవస్థలో అవినీతి నేర సంస్కృతిని పకడ్బందీగా అరికట్టేందుకు చట్టాన్నొకదాన్ని రూపొందించాలనే విషయంలో రాజకీయ పార్టీలన్నీ పకడ్బందీగా నడుములకు తువాళ్ళు బిగిస్తుంటే నవ్వుకాదు రోత పుట్టుకొస్తుంది. అవివీతి విధానాలనే చట్టబద్ధ విధానాలుగా మార్చుకొని దానికి ప్రజాస్వామ్యమని, ప్రజాపరిపాలన అని పేరుతగిలించి కొనసాగిస్తున్న వ్యవహారమంతా అవినీతివిధానమేనని, నేరమయ రాజకీయాలేనని తెలుసుకోలేని అమాయకత్వంలో ఇవాళ ప్రజలులేరు. స్వాతంత్ర్యానంతర 56 సంవత్సరాల కాలంలో ఆయారాజకీయపార్టీలు ప్రజల సంక్షే(క్షా)మం కోసం వెలగబెడుతున్న నీతి! రాజకీయాల గురించిన మొత్తం ప్రస్తావనంతా అవసరం లేదు గాని, ఈ దేశ శ్రామికవర్గం తమ రక్తమాంసాలను ధారపోసిపోగేసిన లక్షలకోట్లరూపాయల విలువచేసే జాతిసంపదల రాశిని గత 13 ఏళ్ళుగా సంస్కరణల పేరుతో దోచే చట్టబద్ధ దోపిడీ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తూ విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు చౌకగా అప్పజెప్పేందుకు కమీషన్ ప్రాతిపదికన దళారీపాత్రను పోషించే విధానమంతా ఏ నీతి చంద్రిక నుండి స్వీకరించినట్లు? బహుళజాతి సంస్థల సరుకుల కొనుగోళ్ళకు ఆర్డర్లివ్వడానికి కోట్లాది రూపాయల అవినీతిగడ్డి కరుస్తున్న నేతల వ్యవహారం అంతా నీతివిధానమే...! తెచ్చిన, తెస్తున్న అప్పులను, అమ్మిన అమ్ముతున్న ఆస్తులను, జరిగిన జరుగుతున్న అభివృద్ధిని, బలిసిన మరింతగా బలిసిపోతున్న వారి ఆస్తుల చిట్టాల్ని, చితికిన మరింత చితికిపోతున్న ప్రజల బ్రతుకుల్ని విశ్లేషిస్తే తెలుస్తుంది రాజకీయపార్టీల నీతివిధానాలభాగోతం.

> రాజకీయనాయకుల్లో పోలీసుశాఖల్లో, ప్రభుత్వ అధికారుల్లో అవినీతి గతం కంటే ఎక్కువైందని తను నిర్వహించిన సర్వేద్వారా వెల్లడైందని ఇటీవల రాష్ట్ర అధికారపార్టీ తెలుగుదేశం స్వయంగా ప్రకటించింది. అందుకు రుజువుగా తన పార్టీకే చెందిన మాజీమంత్రి ఎమ్.ఎల్.ఏ. సి.క్రిష్ణాయాదవ్ స్టాంపులకుంభకోణాన్ని నిర్వహించడం ద్వారా దొరికి పోవడంతో తను నిర్వహించిన సర్వేకు విశ్వసనీయతను తెచ్చిపెట్టుకున్నట్టైంది. ఎంత త్యాగశీలత, ఎంత నిజాయితీ! ఎంత పారదర్శకత!!

స్టాంపులకుంభకోణంలో దొరికిపోయిన మాజీ మంత్రి ఎమ్ఎల్ఏ క్రిష్ణాయాదవ్‌ను పార్టీనుండి బహిష్కరించడం ద్వారా అవినీతికి పాల్పడినవారు సొంతపార్టీలో ఏస్థాయిలో ఉన్నా తెలుగుదేశంపార్టీ క్షమించదనే సందేశాన్ని ప్రజల్లోకి పంపినట్టైందని రాష్ట్ర ముఖ్యమంత్రి తామేదో ఆడినమాట తప్పని సత్యహరిశ్చంద్రునికి తమ్ములమన బడాయిపోవడాన్ని చూస్తుంటే అసహ్యమేస్తుంది. అవినీతికి, నేరమయ రాజకీయాలకు పాల్పడ్డ సొంత పార్టీప్రముఖుల్ని రక్షించుకోవడానికి వెనకేసుకురావడానికి ఏమాత్రం అవకాశముఉన్నా జారవిడుచుకోలేదనడానికి లోగడవెలుగుచూసిన ఉదాహరణలే బోలెడున్నాయి. మర్లకుంట విందులో అడవి మూగజీవాల్ని కాల్చుకుతిన్న మంత్రీపుంగవుల ఘనకార్యం మొదలు, ఇంట్లో బాంబుపేలుళ్ళతో ఫ్యాక్షన్ సంస్కృతిని, గుండా సంస్కృతిని బయటపెట్టుకున్న ప్రజానాయకుడు కోడెల శివప్రసాద్,

జంటహత్యల కేసులో ముద్దాయిగా వున్న రామసుబ్బా రెడ్డిలు తమ కొలువులోనే సచివులుగా కేబినెట్ స్థాయి అధికారాలు వెలగబెడుతుంటే దీనర్థం నేర సంస్కృతి కలిగిన నాయకులను సాగనంపినట్లా? చంకన బెట్టుకున్నట్లా? దళితుడు, మాజీమంత్రి సుద్దాల దేవయ్యపై హత్యానేరారోపణనెదుర్కొన్న మరొక మంత్రి వర్యులు ముద్దసాని దామోదర్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వ సంస్థ సి.బి.సి.ఐ.డి. హైకోర్టులో వేసిన కేసును ఏకంగా ఉపసంహరించుకున్న సంగతిని ఎట్లా మరిచిపోగలం? అయినా రాష్ట్ర సరిహద్దులు దేశ సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతికెక్కిన స్టాంపుల కుంభకోణంలో తనదైన శైలిలో ముద్రవేసిన క్రిష్ణయాదవ్‌ను రక్షించడం అన్నది స్మార్ట్ ముఖ్యమంత్రికి అసాధ్యమైన విషయం. ఏవిధంగానూ రక్షించడానికి కావలసిన అన్ని అవకాశాలు మూసుకుపోయాయి గనుకనే బహిష్కరించారుగాని, రక్షించే అవకాశాలుండి కాదు. కృష్ణయాదవ్‌ను బహిష్కరించిన తరువాత ఇక పార్టీలో గాని ప్రభుత్వ రక్షకభట వ్యవస్థలో గాని ఈ కుంభకోణంతో ఎవరికి ఎలాంటి సంబంధాలు లేనేలేవని ప్రభుత్వం తనకుతానుగా 'మిస్టర్‌క్లీన్' కితాబిచ్చుకోవడం విడ్డూరం. నిజమే, దొరికితేనే దొంగలు. దొరికేవరకు దొరలే గదా! కృష్ణయాదవ్ దొరికేవరకు (అంతకుముందు ఎందరో దొరికి పోయారన్నది చెప్పనవసరం లేదు) తమపార్టీ సుగంధపూరిత తులసీ వనంగానే ప్రచారం చేసుకున్నారు. భవిష్యత్తులో మరోకేసులో మరొక రెవరో గంజాయిమొక్కలా బయటపడేంతవరకు తమది చెక్కుచెదరని తులసీవనమే! కాకపోతే ఇక్కడ గంజాయిమొక్కలు తులసీమొక్కలుగా రూపం ధరించినట్లు మనం అర్థం చేసుకోవలసి వుంది. ఇది ఒక్క తెలుగుదేశం పార్టీకి వర్తించే సూత్రం మాత్రమే కాదు. అన్ని పార్టీలకు అన్ని కాలాలకు వర్తించే తిరుగులేని సూత్రం.

ఇదిలా ఉండగా మరొకపక్క 18 రాష్ట్రాల్లో విస్తరించిన స్టాంపుల కుంభకోణంపై ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం విడివిడిగా దర్యాప్తు జరుపుతున్నట్లు ప్రజలముందు నటిస్తున్నాయి. అదే సమయంలో కేంద్రం సి.బి.ఐ.తో దర్యాప్తు జరిపితేగాని విచారణ సమగ్రం అవ్వదనే విషయాన్ని కొన్ని రాజకీయ నాటక సంస్థలు ప్రకటిస్తున్నాయి. ఏమిటి దీనర్థం? నిజంగా అవినీతి నేర రాజకీయాల అంతుచూడ్డానికి ఈ పార్టీలన్నీ ఉన్నఫళంగా కంకణాలేమైనా కట్టుకున్నాయా? అనే అనుమానం ఈ దేశ సగటు పౌరునికి రావడం అతి సహజం. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ తను దోపిడీ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ప్రజల్ని నమ్మించడానికి కప్పుకున్న పార్లీమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగు తన సహజమైన దోపిడీ, నేరపూరిత వికృత చేష్టలు తారాస్థాయికి చేరి జారిపోతున్న ప్రతీసారి న్యాయవిచారణ, దర్యాప్తు లాంటి పైపై ప్రదర్శిత నాటకీయ కార్యక్రమాల ద్వారా తిరిగి సర్దటం, తద్వారా మళ్ళీమళ్ళీ ప్రజల్ని నమ్మించే ఒక ఎడతెగని కార్యక్రమాలను కొనసాగిస్తుంది. అందులో ఒక కార్యక్రమం ఇప్పటి కుంభకోణంపై జరుగుతున్న తూతూ మంత్రాల దర్యాప్తులు. అంతే తప్ప నిజాయితీతోనో, ప్రజా ప్రయోజనాల రక్షణకోసమో చేస్తున్న కార్యక్రమంగా దీన్ని గుర్తించాల్సిన అవసరం లేనేలేదు.

వ్యవస్థ సామాజికస్థితిని అస్థిరపరిచేఆర్థికనేరాలనుఅదుపుచేయడం కోసం రాష్ట్రంలో 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన వ్యవస్థీకృత ఆర్థికనేరాల నిరోధక చట్టం మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఈ రోజుకు ఏఒక్కరిపైనా ఈచట్టాన్ని ప్రయోగించలేదు. మధ్య తరగతి, పేద ప్రజానీకం తమ అవసరాలను తగ్గించుకొని పొదుపు చేసిన వేలకోట్ల రూపాయలను చేజిక్కించుకుని బోర్డుతిప్పిన సహకార బ్యాంకు యజమానులెందరో ఈ దేశ సరిహద్దులను దాటి దర్జాగా వెళ్ళిపోతున్నారు. వేలకోట్ల విలువచేసే భూములను కబ్జాచేస్తున్న భూబకాసురులు సైతం నిర్భయంగా పెద్ద మనుషులవలె చలామణీ అవుతున్నారు. ఈ చట్టంకింద కేసును నమోదుచేస్తే ప్రత్యేకంగా గుర్తించిన కోర్టులే విచారించాల్సి వుంటుందన్న నిబంధనను అవకాశంగా తీసుకున్న మన 'సుపరిపాలనా' ప్రభుత్వం ప్రత్యేక కోర్టును గుర్తించడానికే రెండున్నరేళ్ళు నాన్చింది. దీన్నిబట్టి అర్థంచేసుకోవచ్చు ఆర్థికనేరాల్ని అరికట్టడంలో ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని. ప్రస్తుత స్టాంపుల కుంభకోణాన్ని గూర్చిన దర్యాప్తు కార్యక్రమంలో సైతం ఇంతకు భిన్నమైన ధోరణేదో అవలంబించడంతో అద్భుతమైన ఫలితాలేవో వస్తాయని అనుకోవడానికి వీలులేదు. మరొకవైపు ఇటీవలే పురుడుపోసుకున్న ఉగ్రవాదనిరోధక పోటాచట్టం కింద తమ అవినీతి దోపిడీరాజకీయాలకు అడ్డు తొలగించుకోవడానికి అనేకమంది ప్రజాతంత్ర వామపక్ష శక్తులతో సహా నక్సలైట్లకు సహాయ సహకారాలందిస్తున్నారనే ముద్రవేసి అనేకమంది అమాయకులను కటకటాలపాలు చేయడంలో పాలక వర్గాలు వేగంగా స్పందిస్తున్నాయి. ఇప్పటికే పోటాచట్టం కింద రాష్ట్రంలో పాతికదాకా కేసులు నమోదైన విషయాన్ని గుర్తుచేసుకుంటే పాలకవర్గాల రాజకీయ ద్విముఖ స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఆస్తుల సంపాదనకు వ్యాపారాల తర్వాతిస్థానం రాజకీయాలు. అక్రమార్జనకు రాజకీయాలను మించిన రాజమార్గం లేదన్నది గ్రామ స్థాయి వార్డుమెంబరు నుండి అత్యున్నత ప్రజాప్రతినిధి స్థానం ప్రధాన మంత్రిదాకా రుజువైపోయిన విషయం. ప్రజాసేవే పరమార్థంగా ఉండాల్సిన రాజకీయాలు పెట్టుబడే ప్రధాన అర్హతగా అక్రమంగా

ఆస్తులు పోగేసుకోవడమే పక్కా లక్ష్యంగా మారిపోయిన నేపథ్యంలో ప్రస్తుత స్టాంపుల కుంభకోణంలో ఇరుక్కుపోయిన తెలుగుదేశం పార్టీ, దాని మాజీమంత్రి క్రిష్ణాయాదవ్ మొదటివాళ్ళూ కారు, చివరివాళ్ళూ కారు. అవకాశం వుంటే ఆర్థిక, సామాజిక, రక్షణ అంశాలను అవినీతికర నేర రాజకీయాలతో అస్థిరపరచడం ద్వారా ఈ దేశ సర్వసమగ్ర సార్వభౌమత్వాన్ని నిర్వీర్యపరచడం మాత్రమే కాదు, సర్వనాశనంచేయడానికైనా వెనుకాడకపోవడంలో దేశరాజకీయ పార్టీల్లో దేనికేది తీసిపోదనే విషయం తాజాగా మరోసారి రుజువైంది. అధికారికంగా, చట్టబద్ధంగా ఏ ఒక్కటీ రుజువు కాకపోవచ్చు గాని (చట్టబద్ధ సంస్థల అవినీతి కార్యక్రమాలు చట్టబద్ధంగా రుజువైతా యనుకోవడం ఉత్తి తెలివిమాలినతనం) లోగడ భోఫోర్స్, యూరియా, చక్కెర, పశుగ్రాసం, హవాళా, సైనికజవాన్ల శవపేటికల కుంభకోణాలు అందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇవేకాకుండా పలు రాష్ట్రాల్లో వందలవేల కోట్ల విలువచేసే ఎన్నెన్నో కుంభకోణాలు రోజూ వెలుగుచూస్తూనే వున్నాయి. మొన్నటికి మొన్న తెహల్కా డాట్ కామ్, అధికారదాహం పంపకమే పరమలక్ష్యంగా జతకట్టి కేంద్రంలో ప్రభుత్వాన్ని చెలాయిస్తు నానాజాతి రాజకీయపార్టీల జాతీయ కూటమిలో దేశభక్తికి సంబంధించిన నిజాయితీ, నిబద్ధతల పాళ్ళ ప్రమాణాలు ఏ మోతాదులో ఉన్నాయోనని చేసిన అనధికారిక ప్రయోగ పరీక్షలో అవినీతికి నూటికి నూటపాతిక మార్కులొచ్చిన సంగతి దేశప్రజలకు మరిచిపోలేని అనుభవం. అలాంటప్పుడు ఎవరికివారు గురవింద గింజల్లా తమతమ పార్టీలది మేడిపండు వైభవాలను పోలిన మురుగు చరిత్ర అనే వాస్తవాన్ని మరిచిపోయి దాన్ని పరిచిన విస్తరిలా ప్రజల ముందుంచడానికి ఏ ఒక్కపార్టీ ఎంతమాత్రం సిగ్గుపడడంలేదు.

'నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్లు' తమ ఆశలకు ఆకాంక్షలకు అనుగుణంగా, సామాజక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ప్రజాస్వామ్యంలో పరిపూర్ణంగా పరిఢవిల్లి పరిరక్షించబడతాయని నమ్మిన ప్రజలు అందుకు పనిముట్లుగా ప్రతినిధులను ఎన్నుకుంటే వాళ్ళు ప్రజాసంపదలను స్వాహాచేసి ప్రజలపై స్వారీ చేయడానికి నైతిక విలువలకు తిలోదకాలిచ్చి ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్నారు. ప్రజల దైన్యస్థితిని అవకాశంగా చేసుకొని ఒక్కవరమడిగితే వంద వాగ్దానాలు చేసి అందలాలెక్కుతున్న రాజకీయపార్టీలు పూటకో వేషం, గడియకో అబద్ధం, రోజుకో కుంభకోణంగా దినదిన ప్రవర్ధమాన మవుతూ అధికారమంటే ఆర్జించడంగా, రాజకీయాలంటే రౌడీయింజంగా ఎప్పుడో దశాబ్దాల క్రితమే రాజకీయ(వి) నాయకులు అర్థాలు మార్చివేశారు. అలాంటి దోపిడీ రాజకీయ వ్యవస్థలో తామర తంపరలుగా వెలుగు చూస్తున్న కుంభకోణాలు ఆశ్చర్యకరమైన విషయాలేమీ కావు. వాటికి ఈ పార్టీ, ఆ పార్టీ అనే తరతమ భేదాభిప్రాయాలేమీ వుండవు. పైగా అవి అతి సాధారణమైన అంశాలు మాత్రమే. అయితే ఎటూ వాటిని ఎంతకాలం భరిస్తా మన్నదే మనం ఎవరికివారుగా వేసుకోవలసిన కీలకమైన ప్రశ్న.

రాజకీయ నాయకులు నేరాలు చేయడం, కటకటాలు లెక్కించ వలసిన నేరగాళ్ళు రాజకీయరంగంలో ప్రవేశించడం మామూలై పోయిందనే ఆవేదనొకటి మధ్యతరగతి మేధావుల్లో కనబడుతుంది. వందలవేల కోట్ల కుంభకోణాలు వెలుగుచూసి రాజకీయనాయకులు, ఉన్నతాధి కారులు బయటపడుతున్న ప్రతిసారీ సామాన్య ప్రజానీకం నుండి మధ్యతరగతి వరకు 'ఔరా'! అనేతరహాలో ఆశ్చర్యాన్ని వ్యక్తం చేయడం, దేశంలో జరగరాని ఉపద్రవాలేవో జరిగిపోతున్నాయని ఆందోళనచెందడం సాధారణంగాకనబడుతుంది. ఈరకమైన భావోద్వే గాలకు వ్యవస్థమీద ఉన్న అపారమైన నమ్మకం, విశ్వాసం కారణం.

సమాజంలోని మానవులందరికీ సమానత్వాన్ని, సంక్షేమాన్ని, సౌఖ్యాన్ని ఏర్పరిచే లక్ష్యాలేవో రాజకీయాలకు ఉన్నాయనే మానసిక స్థితి కారణంగానే ఈరకమైన ఆశ్చర్య ఆవేదనలకు సంబంధించిన భావోద్వేగాలకు లోనవుతున్నాం. ఎందుకిలా జరుగుతుంది? రాజకీయాలెందుకిలా మారిపోతున్నాయి? దీన్నర్థం చేసుకోవడం కొంచెం కష్టమైనా తప్పనిసరిగా అర్థం చేసుకోవలసిన అవసరంఉంది.

రాజకీయాలంటే వ్యవస్థ పునాది నిర్మాణంతో సంబంధం లేని సర్వకాల సర్వ వ్యవస్థల్లో ఒకేరకమైన స్వభావంతో కొనసాగే కార్య క్రమాలు కావని, అవి సర్వజనులకు ఒకేరకమైన ఫలితాలివ్వవని అర్థం చేసుకుంటే ఈ రకమైన ఆశ్చర్యానికి లోనుకాము. రాజకీయాలకు సర్వమానవ సమానత్వం, సంక్షేమం, సౌఖ్యాల లక్ష్యాలను నిర్దేశించడం అసహజం. అవాంఛనీయమైన ఆలోచనేం కాదు కాని, వర్గసమాజంలో అది అసాధ్యమైన విషయమన్నది మాత్రం తిరుగులేని వాస్తవం. వర్గసమాజంలో రాజకీయాలు కూడా ఒక వర్గప్రయోజనాలకు అనుకూలంగా మాత్రమే అదీ ఆధిపత్య వర్గ ప్రయోజనాలకు అనుకూలంగానే ఉంటాయి తప్ప అందరికీ ఒకేలా వర్తించవు. అసలు రాజకీయాలంటే సమాజంలోని ఉత్పత్తి సంబంధాలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలని స్థిరపరచడానికో, లేదా అస్థిరపరచడానికో చేసే కార్యక్రమాలు. దోపిడీ ఉత్పత్తి సంబంధాల పునాదిగల వైరుధ్య వర్గసమాజంలో పై రెండురకాల స్వభావాలతో పనిచేసేరాజకీయాలు నిరంతరం ఘర్షణ పడుతుంటా యన్నది రాజకీయాల నిర్వచనం అర్థమైనపుడు తెలుస్తుంది. అంటే ఒకరకమైన రాజకీయాలు దోపిడీ కార్యక్రమాలను యథాతథంగా

(తరువాయి భాగం 10వ పేజీలో)

ఉపాధికల్పన ఓ 'ఎండమావి'

— ప్రొ॥ పి. నారాయణరెడ్డి

ఉపాధికల్పన మొదటి పంచవర్ష ప్రణాళిక నుండి పదవ పంచవర్ష ప్రణాళికవరకూ ప్రధానఆశయంగా పెట్టుకొని వ్యూహాలను రచించుకొని సాధించడానికి ప్రయత్నం జరుగుతూవస్తున్నది. అన్ని ప్రణాళికలు లాగే పదో పంచవర్ష ప్రణాళికలో కూడా ఉపాధికల్పనను ప్రధానధ్యేయంగా ఎంచుకున్నది. ప్రణాళికాంతానికి ఐదుకోట్లమందికి ఉపాధి కల్పించాలన్నది ధ్యేయం. ఈ ధ్యేయం మాత్రం చాలా ప్రశంసించదగ్గది. కానీ సాధించడం సంభవమేనని సందేహింపక తప్పదు.

పదో పంచవర్ష ప్రణాళిక అంచనాల ప్రకారం ఏదోఒక ఉపాధి కలిగినవారి సంఖ్య 40 కోట్లు. ఇందులో కూడా వాస్తవం లేదు. ఎందుకంటే వ్యవసాయరంగంలో పనిలేనివారి సంఖ్య గణనీయంగా వుందన్న విషయం మనందరికీ తెలుసు. ఆ సంఖ్యను మైనస్ చేస్తే వాస్తవం తేలుతుంది. ఒకవైపు నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఇంకొకవైపు ఉపాధికల్పన పాలకులనుకున్నంత సమృద్ధిగా ఏమీలేదు.

ఒక అంచనా ప్రకారం 1997 నుండి 2001 మధ్యకాలంలో వ్యవస్థీకృత రంగంలో 9.1 లక్షల ఉపాధితగ్గిపోయింది. ఒక్క 2001-2002 లోనే అంతకంటేముందు మూడు సంవత్సరాలలో తగ్గినదాని కంటే ఎక్కువే. అలాగే 2002-2003లో కూడా 2001-2002 కంటే ఏమాత్రం మెరుగ్గా ఉండదనేది అంచనా. ఎందుకిలా ఉపాధి గణనీయంగా తగ్గిపోయిందంటే అనేక పరిశ్రమలు మూతపడి పోవడం, సేవారంగంలో యాంత్రీకరణ, పోటీ సామర్థ్యాన్ని పెంచుకొనే ప్రయత్నంలో లక్షలాదిమందికి స్వచ్ఛంద విరమణ చేయించడం లాంటివే ప్రధాన కారణాలు. మరో అంచనా ప్రకారం 2000వ సంవత్సరం నుండి 27 లక్షలమంది నిరుద్యోగులయ్యారు. ఒక్క వ్యవస్థీకృత పారిశ్రామిక రంగంలోనే 1997-2001మధ్యలో 4.6 లక్షలమంది ఉపాధి కోల్పోయారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న 'సేవల'రంగం జి.డి.పి.లో 50శాతం వాటా కలిగివున్నా కేవలం 4.3 లక్షల మందికి మాత్రమే ఉపాధి కల్పించగలిగింది.

విశేషమేమిటంటే ఉపాధికల్పన ఎక్కువగా జరుగుతుందని మన ప్రణాళికా సంఘం ఆశిస్తోందంటే సంవత్సరానికి 70 లక్షలు వ్యవసాయరంగంలోనూ, 12 లక్షలు పారిశ్రామికరంగాల్లో చిన్నతరహా పరిశ్రమలు 20 కోట్లమందికి (2002 నాటికి) ఉపాధి కల్పిస్తుందని అంచనా వేసింది. ఇతర రంగాలలో తక్కిన ఉపాధి జరుగుతుందని, అంటే ప్రపంచీకరణ యుగంలో సాంప్రదాయ రంగాలైన వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, మొదలగు రంగాలలో ఉపాధి ఇతోధికంగా జరుగుతుందని ఆశ. ఇది ఎంత అవాస్తవమో మనకు సులభంగా అర్థమవుతుంది. ఎందుకంటే వ్యవసాయ రంగం ఇప్పటికే ఛిన్నాభిన్నమైపోయింది. యాంత్రీకరణ పెరుగుతోంది. సరళీకరణ విధానాల వల్ల విదేశీ వస్తువులు వరదలా ప్రవహిస్తుండడంతో లక్షలకొద్దీ చిన్న పరిశ్రమలు మూతపడు తున్నాయి. ఉపాధి ఇతోధికంగా కల్పిస్తాయనుకున్న ప్రధాన రంగాల పరిస్థితి ఇలా వుంటే, ఇంకొకవైపు ఈ రంగాలే ఉపాధి కల్పిస్తాయని ఆశించటం మన ప్రణాళికా సంఘానికి, దానికి సలహా ఇచ్చేవారికే ఇది ఎంత విడ్డూరమో తెలియాలి.

అసలు ఉపాధికల్పన సంవత్సరానికి కోటికిపైగా జరుగు తుందని ఎలా అంచనా వేశారనేది మనం గమనిస్తే వాస్తవానికి మనమెంతదూరంలో వున్నామో మనకర్థమౌతుంది. 10వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యం వార్షిక వృద్ధిరేటు 8 శాతంగా నిర్ణయించడమైనది. అలాగే స్థూల పొదుపురేటు 24.4 శాతం నుండి ప్రణాళికాంతానికి 29.4 శాతానికి పెరుగుతుందని భరోసా. ఎగుమతులు సగటు వార్షిక వృద్ధిరేటు 12.4 శాతాన్ని సాధిస్తుందని అంచనా. ఫలితంగా ఈ పంచవర్ష ప్రణాళికా కాలంలో 5 కోట్లమందికి ఉపాధి ఏర్పడి నిరుద్యోగ శాతం 9.21 శాతం (2001-02) నుండి ప్రణాళి కాంతానికి 5.11 తగ్గిపోతుందని ఆశ. ఇలా ఆశపడడంలో తప్పు లేదు. కానీ వాస్తవానికిది ఎంతదూరం? ఇంతటి బృహత్తర ఆశయానికి ఎలాంటి ప్రయత్నం అవసరం? అందుకు ఎలాంటి వనరులు కావాలి? అంటే ఆశించినదానిని సాధించడానికి ఆచరణలో ఎంతటి ప్రయత్నం వుండాలో, అలాంటి ప్రయత్నం వుందా! లేదనే చెప్పాలి. ఎందుకంటే జి.డి.పి. వృద్ధిరేటు 8 శాతం సాధించడం అసాధ్యమని ప్రణాళికా సంఘం ఛైర్మన్, ప్రధానమంత్రి బహిరంగంగా ఒప్పుకున్నారు. అలాగే ఈ ప్రణాళిక మొదటి సంవత్సరమైన 2002-2003లో సాధించిన జి.డి.పి. వృద్ధిరేటు కేవలం 4.4 శాతం మాత్రమే. అంటే మిగిలిన 4 సంవత్సరాలలో 9 శాతం జి.డి.పి. వృద్ధిరేటు సాధిస్తేనే 8 శాతం వీలవుతుంది. వాస్తవ పరిస్థితులలో ప్రణాళికాసంఘం సాధించాలనుకున్నలక్ష్యం గగనకుసుమమే. ఎక్కువ మంది అంచనా ప్రకారం జి.డి.పి. వృద్ధిరేటు 5.6 శాతం కంటే మించక పోవచ్చు. దీని అర్థం 8 శాతం జి.డి.పి.ని సాధిస్తే 5 కోట్లు ఉపాధి కల్పన జరుగుతుంది. కావున 5.6 శాతం జి.డి.పి. వృద్ధి జరిగితే ఉపాధికల్పనలోకూడా తదనుగుణంగా తగ్గిపోతుందన్నమాట. అంటే ఉపాధికల్పనకు జి.డి.పి. వృద్ధిమీద మోయలేని భారం మోపడమే.

ఇంకొకవైపు నుంచి ఆలోచిస్తే ఆశించిన జి.డి.పి. వృద్ధిరేటును సాధించాలంటే అనూహ్యంగా పెట్టుబడులను పెంచాలి. ప్రణాళికలో పెట్టుబడులపెరుగుదల 62 శాతం. కానీ పెట్టుబడులకేటాయింపులో వ్యవసాయరంగానికి 51 శాతం, చిన్నతరహా పరిశ్రమల రంగానికి

(తరువాయి భాగం 22వ పేజీలో)

కాన్‌కున్‌లో పేదదేశాల ఐక్యత కొనసాగాలి

— వి. హనుమంతరావు

ప్రపంచ మార్కెట్లను కబళించి, వాటిని తమ పాదాక్రాంతం చేసుకోవడమే ప్రపంచీకరణ లక్ష్యమైతే, ఆ లక్ష్యానికి కాన్‌కున్ సమావేశం ఎదురుదెబ్బ తీసింది. ప్రపంచ వాణిజ్యసంస్థ(డబ్ల్యుటిఓ) ద్వారా వర్ధమాన దేశాలపై పంజా విసరబోయి, అమెరికా, యూరోప్ దేశాలు చతికిలబడ్డాయి. అగ్రరాజ్యఅహంకారంతో ఇరాక్‌పై దాడిచేసి సాధించిన విజయం నీరుకారిపోయి అమెరికా తనదేశంలోనే విమర్శలనెదుర్కోవటం మొదటిదెబ్బ అయితే, కాన్‌కున్ సమావేశం రెండోదెబ్బ తీసింది.

ఈ రెండు విషయాల్లో భారతదేశ వైఖరి అమెరికాకు మింగుడు పడడంలేదు. యుద్ధానంతరం ఇరాక్‌కు భారత సైనికులను పంప నిరాకరించింది. కాన్‌కున్‌లోకూడా తన వ్యవసాయరంగాన్ని రక్షించు కోవటానికి అమెరికా చేసిన విశ్వప్రయత్నాన్ని కూడా 22 దేశాలతో కలిసి భారతదేశం అడ్డుకుంది. భారతదేశానికి ఇంత ధైర్యమా? తనను కాదనడానికి ఎన్ని గుండెలుండాలి? దెబ్బకుదెబ్బ తీయడానికి అమెరికా పావులు కదుపుతోంది.

అమెరికాలో ఒక చట్టం తయారవుతోంది. ఆ దేశానికి ఎగుమతులు చేసేవారు సరుకులతో ఓడ బయలుదేరడానికి అయిదు రోజులముందే ఆ ఓడలో ఎగుమతిచేస్తున్న ఉత్పత్తుల వివరాలు అమెరికాకు తెలియచేయాలట. అలా తెలియచేయకపోతే, ఆ ఓడను నిలుపుదల చేయడమేకాక, ఎగుమతిదారులమీద సివిల్, క్రిమినల్ చర్యలుతీసుకుంటుందట. ఢిల్లీలోని అమెరికారాయబారకార్యాలయం లోని వ్యవసాయ వ్యవహారాలు చూసే అధికారిప్రకారం పై నిబంధనలు వర్తించే రెండువేల ఉత్పత్తుల పట్టికనొకదానిని అమెరికా తయారు చేస్తుంది. ఈ కొత్త నిబంధనలు వచ్చే డిసెంబరు 12 నుంచి అమలు లోకి వస్తాయని, ఆ తేదీకి కొద్దిదినాల ముందు మాత్రమే పట్టికను ప్రకటిస్తుంది. ఇది భారతదేశం నుంచి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసేవారిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. దేశం నుంచి బాస్మతి బియ్యం, రెడీ-టు-ఈట్ పదార్థాలు, సుగంధద్రవ్యాల ఎగుమతులను దెబ్బ తీస్తుంది. అమెరికాను వ్యతిరే కించినందుకు ఇండియాలాంటి దేశాలకు అమెరికా విధించబోయే శిక్ష ఇదన్నమాట. ఇలాఒకపక్క అమెరికాచెంపదెబ్బకొడుతుంటే ప్రధాని బుష్‌తో చర్చలుజరుపుతారట. ఇదేదో కేవలం ఇండియాను మాత్రమే దృష్టిలోవుంచుకొని చేయబోతున్నపని కాదు. వర్ధమాన, అభివృద్ధి కాముక దేశాలన్నింటికీ అమెరికా ఇస్తున్న వార్నింగ్.

వర్ధమానదేశాల పట్ల కాఠిన్యాన్ని విడనాడి, కాస్త సర్దుబాటు చేసుకోవాలనేది, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను తమదేశాల్లోకి అనుమతించటం విషయంలో కాస్త వెసులుబాటు ప్రదర్శించాలనేదే కాన్‌కున్ సమావేశంలో వర్ధమానదేశాల కోరిక. కాని ఎగుమతులను మరింతి పకడ్బందీగా నిరోధిస్తామనే పై చర్యద్వారా అమెరికా ఈ దేశాలకు చెబుతున్నదేమంటే ఇకముందు మీ దేశాల ఎగుమతుల పట్ల మరింత కాఠిన్యత చూపబోతున్నామని చెప్పటమే. ఒకరకమైన మధ్యవర్తిత్వ వేదికగా ఉద్దేశించిన డబ్ల్యుటివో ఆచరణలో ప్రవర్తిస్తున్న తీరు ఇది. ఈ సంస్థ అధ్యక్షుడు సుపాచీ కాన్‌కున్ సమావేశానంతరం ఒక వ్యాసం వ్రాస్తూ "రాజీకి రాకపోవటం వల్ల నష్టపోయేది పేదదేశాలే" అని అన్నాడంటే అమెరికాను వ్యతిరేకించినందుకు మీ చావు మీరు చావండి అని అన్నట్లే అవుతుంది. దీనితో డబ్ల్యుటివో సంస్థ అమెరికా జేబు సంస్థ అని మరోసారి రుజువైంది. అంతేకాదు, ఈ సంస్థనుంచి బయటకు రావాలనేవారి వాదనకు మరింత బలం చేకూరిందని చెప్పవచ్చు. ఇంతకు కాన్‌కున్‌లోజరిగిందేమిటి? అమెరికా, యూరోప్ దేశాలు తమ రైతులకు ఎడమచేత్తో కుడిచేత్తో సబ్సిడీలు ఇస్తున్నాయి. ఇందువల్ల ఆ దేశానికి ఎగుమతులు చేసే దేశాలు పోటీకి నిలువలేకపోతున్నాయి. ఈ సబ్సిడీలను తగ్గించు కోవాలని ఇదివరకే ఈసంస్థలో వెలిబుచ్చిన అభిప్రాయాన్ని అమెరికా ఆలోచించడానికి కూడా నిరాకరించింది. ఇందుమీద 22దేశాలు కలిసిచేసిందల్లా తమదేశాల రైతాంగం ప్రయోజనాలను రక్షించుకునే ప్రయత్నం మాత్రమే. దీనిని కూడా అమెరికా సహించలేక పోతుందంటే, ఇరాక్‌లో ఎదురుదెబ్బ తిన్న తర్వాత కూడా అమెరికా ఎంత తెంపరితనంతో ప్రవర్తిస్తుందో విదితమవుతుంది. ఈ వైఖరి మన బస్తీల్లో తమ జమానా చలాయించడానికి గుండాల ప్రవర్తనను తలపుకు తెస్తుంది.

వర్ధమానదేశాలు కాన్‌కున్‌లో సాధించిన చిన్న విజయాన్నుంచి పాఠం నేర్చుకోవాలి. బహుళజాతి సంస్థలు, అమెరికా సహాయంతో, ఏకధృవ ప్రపంచంలో తమకెవ్వరూ పోటీ ఉండకూడదనే లక్ష్యంతో ప్రపంచీకరణ ముసుగుచాటున ప్రపంచ మార్కెట్లను, ముఖ్యంగా ఇండియా, చైనాలాంటి విశాలమార్కెట్లను తమగుప్పిటలోకితీసుకోవా లనే ప్రయత్నంలో వున్నాయి. కాన్‌కున్‌లో ఆ ప్రయత్నానికి చిన్న విఘాతం కలిగింది. అవి దెబ్బతిన్నతాచుపాములా ఇకముందు విజృంభించవచ్చు. దీనిని ఏఒక్క దేశమూ ఎదుర్కొని నిలబడలేదు. ఉమ్మడిగా సంపన్నదేశాల ఎత్తుగడలను ఎదుర్కోవడం ద్వారానే తమదేశాల, ముఖ్యంగా రైతాంగం ప్రయోజనాలను రక్షించుకో గలుగుతాయి. సార్క్‌లాంటి ప్రాంతీయ కూటమిలతో ఈ ప్రయత్నా నికి నడుం బిగించాలి.

ఈ శతాబ్దం ఆరంభంలో ఇది ఆసియాదేశాల శతాబ్దం కాబోతుందనే ఆశ వ్యక్తం చేయటం జరిగింది. అది కలకారాదు, నిజమే, సాధ్యమే అని దృఢచిత్తంతో ముందుకు సాగాలి. ❍

గత రెండు దశాబ్దాల్లో రాష్ట్ర ఆర్థిక ధోరణులు - 2

— ఎన్. శ్రీదేవి
(రిసెర్చి అసిస్టెంట్, సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్, హైదరాబాద్)

(గత సంచిక తరువాయి)

1983 తర్వాత ద్రవ్య ధోరణులలో ఒక పెద్ద మార్పు వచ్చింది. ద్రవ్యలోటులో రెవెన్యూలోటు ఒక ముఖ్యమైన భాగమైపోయింది. 84-85 నుంచి ఆ భాగం శాతం 20 నుంచి 30 శాతం దాకా వుంటూ వచ్చింది. 96-97లో అయితే ఒక్క ఉదుటున 113.72 శాతానికి చేరుకుంది. 98-99 తర్వాత (99-00 మినహాయించి) 40-50 శాతంమధ్య తచ్చాడుతూవచ్చింది. ఒక్క 93-94లో తప్ప 90వ దశకంలో రెవెన్యూమిగులు ఎప్పుడూలేదు. పెట్టుబడిపద్దు నుంచి రెవెన్యూ లోటును పూడ్చటం అనేది ఆ దశకంలో సుమారుగా అన్ని రాష్ట్రాల్లో జరిగింది.

80-89 మధ్యకాలంలో స్థూల ద్రవ్యలోటుతో పెట్టుబడి కేటాయింపు 60.87 శాతం (84-85) నుంచి 141.18 శాతం (82-83)గా వుంటూ వచ్చినా 90వ దశకం ఉత్తరార్థ కాలంలో 46 శాతంలోపుగానే వుంటూవచ్చింది.

స్థూల రాష్ట్రాదాయంలో ద్రవ్యలోటు 82-83లో 1.59 శాతం నుంచి 86-87లో 4.9 శాతం మధ్యన వుంటూ వచ్చింది. 92-97 మధ్య 3 శాతంగావుండి 97-98లో 2.53 శాతానికితగ్గి 01-02లో మళ్ళీ 4.5 శాతానికి పెరిగింది. స్థూల రాష్ట్రాదాయంలో పెట్టుబడి ఖర్చు 80వ,90వదశకాల్లోతగ్గింది(93-94 నుంచి 95-96 తప్ప).

వడ్డీ చెల్లింపులు

వడ్డీ చెల్లింపులు మినహాయించి ద్రవ్యలోటు ధోరణులను పరిశీలిస్తే 80-81లో 37 శాతం వడ్డీ చెల్లింపులకే పోయింది. ద్రవ్యలోటులో వడ్డీ చెల్లింపులు .53 నుంచి 83 శాతం (92-93/ 97-98)గా వుండి 00-01లో 52 శాతానికి పడిపోయింది. దీనర్థం ఏమంటే భారీగా వడ్డీ చెల్లింపులే రెవెన్యూ లోటు, ద్రవ్యలోటుకు ప్రధాన కారణమని స్పష్టమవుతుంది. ఈ వడ్డీ చెల్లింపులు స్థూల రాష్ట్రాదాయంలో 80వ దశకంలో 1 శాతం నుంచి 1.67 శాతానికి పెరిగితే దశకంలో, ఆ తర్వాత 02-03 (సవరించిన అంచనా) మధ్య 1.77 నుంచి 3.05 శాతానికి పెరిగింది.

రుణాలుచేయటం ద్వారానే ద్రవ్యలోటును పూడ్చటం జరిగింది కాబట్టి, 80, 90 దశకాల్లో ఎక్కువ సంవత్సరాల్లో ద్రవ్యలోటుకన్నా రుణం తిరిగి చెల్లింపులే ఎక్కువగా వుంటూవచ్చాయి. ఉదాహరణకు 80-81లో ద్రవ్యలోటులో రుణం చెల్లింపులు 38 శాతం అయితే, వడ్డీశాతం 37 శాతంగా వుండింది. ఈ కారణంగా, తెచ్చిన రుణాలన్నీ అభివృద్ధికోసం ఖర్చుచేయడానికి వీలులేకుండాపోయింది. 88-95 మధ్యకాలంలో అయితే, రుణం చెల్లింపుల రేషియో కన్నా, వడ్డీ చెల్లింపులు శాతం రేషియో ఎక్కువైపోయింది. అంటే రాష్ట్రం మీద వడ్డీ చెల్లింపుల భారం మరీ పెరిగిపోతూ వచ్చింది.

	ద్రవ్యలోటు	మొత్తం రుణభారం	సగటు వడ్డీరేటు
1980-81	222.69	74.76	6.08
1981-82	243.65	182.46	5.92
1982-83	172.38	395.00	6.53
1983-84	493.02	106.25	6.88
1984-85	591.40	203.48	9.03
1985-86	435.29	241.24	8.49
1986-87	803.27	102.52	9.06
1987-88	567.29	172.45	10.17
1988-89	671.86	91.50	11.18
1989-90	971.58	74.87	-
1990-91	967.07	83.49	1157
1991-92	1135.32	95.96	12.31
1992-93	1569.29	69.24	12.62
1993-94	1833.19	73.88	13.10
1994-95	2348.52	85.29	13.56
1995-96	2416.81	135.94	14.00
1996-97	2811.53	158.45	14.86
1997-98	2427.76	246.21	14.78
1998-99	5705.57	156.29	14.83
1999-00	971.58	1195.06	15.19
2000-01	7305.85	200.43	15.16
2001-02	6723.12	266.36	16.84
2002-03 (R)	7341.39	176.17	-
Average	1388.81	144.70	

రుణభారం

80వ దశకంలో రెవెన్యూ ఆదాయం పెరుగుదల రేటుకన్నా తక్కువగా వుంటూరాగా 90వ దశకంలో తద్విరుద్ధంగా పెరుగుతూ వచ్చింది. అందువల్ల కేంద్రం రుణాలమీద ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, రాష్ట్ర రుణభారంలో కేంద్రం నుంచి తెచ్చుకున్న రుణాలభారం గణనీయ భాగంగా పెరగటం, అలాగే వడ్డీభారం పెరగటం జరిగింది. 80-81లో, అలాగే 81-90లో చేసిన రుణంలో 37 శాతం రుణం తిరిగి చెల్లింపులకే పోయింది. మిగతా సంవత్సరాల్లో అయితే ఈ శాతం 56 (86-87) నుంచి 72 (84-85) మధ్య వుంటూ వచ్చింది. అయితే, ఏ సంవత్సరాల్లో అయితే రెవెన్యూ పద్దుకింద మిగుళ్ళు ఏర్పడ్డాయో, ఆ సంవత్సరాల్లో వడ్డీభారం, ద్రవ్యలోటు తగ్గి, పెట్టుబడి ఖర్చు ఎక్కువ పెట్టడానికి అవకాశం ఏర్పడింది. చేసిన రుణంలో తీర్చిన అప్పుల శాతం 80వ దశకంలో 31.99 శాతం (88-89) నుంచి రూ.71.59 శాతం (84-85) మధ్య వుంటూరాగా, 90వ దశకంలో 16.84 (93-94) నుంచి 01-02లో 71.11 శాతానికి పెరిగిపోయింది. అంటే సుమారుగా 30 శాతం మాత్రమే నికరంగా రుణం చేతికి వచ్చిందన్నమాట. వివరాలు ఈ కింది పట్టికలో చూడవచ్చు.

కోట్ల రూ.లలో

	చేసిన రుణం	చెల్లించిన రుణం	నికర రుణం	చేసిన అప్పులో . తీర్చిన అప్పుశాతం
1980-81	256.67	93.99	162.68	36.62
1981-82	517.95	347.70	170.25	67.13
1982-83	803.10	568.75	324.35	70.82
1983-84	679.40	400.79	278.61	58.99
1984-85	1466.11	1049.53	416.58	71.59
1985-86	1358.86	859.01	499.85	63.22
1986-87	938.18	527.9	410.28	56.27
1987-88	1098.52	665.41	433.11	60.57
1988-89	756.38	241.96	514.42	31.99
1989-90	898.73	256.45	642.28	28.53
1990-91	1069.93	217.88	852.05	20.36
1991-92	1441.97	394.45	1047.52	27.35
1992-93	1412.74	256.73	1156.01	18.17
1993-94	1956.16	329.43	1626.74	16.84
1994-95	2461.90	746.69	1715.21	30.33
1995-96	3650.45	1756.42	1894.03	48.12
1996-97	4429.08	2616.16	1812.92	59.07
1997-98	6232.40	3824.21	2408.19	61.36
1998-99	9875.30	6273.61	3601.69	63.53
1999-00	13165.11	8449.57	4715.54	64.18
2000-01	15.097.56	10773.18	4324.38	71.36
2001-02	18608.19	13232.63	5375.56	71.11
2002-03 (R)	12069.15	6876.67	5192.48	56.98

ముగింపు

ద్రవ్యవిషయాల్లో ప్రభుత్వతీరును గమనిస్తే స్థూలరాష్ట్రాదాయంలో పెట్టుబడి ఖర్చు మెల్లగా పెరగటం, రెవెన్యూ ఆదాయం పెరగటం 95-96లో 7.17 శాతం నుంచి 9.56 శాతానికి (00- 01) పెరగటం గమనించవచ్చు. కాని అదే సమయంలో, రెవెన్యూ, ద్రవ్య లోట్లు పెరిగాయి. ద్రవ్యలోటులో మొత్తం రుణం రేషియో పెరిగింది.

1974-82 మధ్యకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మంచిగా నడిచింది. 82-83 వరకూ రాష్ట్రానికి రెవెన్యూ మిగులు వుండడంతో, ఈ మిగులును, అభివృద్ధికోసం తెచ్చిన రుణాన్ని ఆస్తులసృష్టికి ఖర్చు చేయటం జరిగింది. 90వ దశకంలో ఒక్క 93-94 మాత్రమే రెవెన్యూ మిగులును చూపించింది. 1983కు పూర్వం, తర్వాత సంవత్సరాల మధ్య కొట్టొచ్చినట్లు కనపడేదేమంటే పూర్వ సంవత్సరాల్లో ఎప్పుడైతే రెవెన్యూ ఖర్చుకన్నా, రెవెన్యూ ఆదాయం ఎక్కువగా వుంటుందో, అపుడు ఆ మిగులును రెవెన్యూ పద్దుకింద ఖర్చుపెట్టేయకుండా, ఆ మిగుళ్ళను కొంతమేరకు పెట్టుబడిపద్దుకింద ఖర్చుకు, అంటే ఆస్తుల సృష్టికి వినియోగిస్తూ వచ్చారు. అయితే 1983 తర్వాతకాలంలో రెవెన్యూ ఆదాయం పెరిగినపుడల్లా, ఆ పద్దుకింద ఖర్చుపెట్టేయడం జరుగుతూ వచ్చింది. కాగా, రెవెన్యూ ఆదాయం తగ్గినపుడు, ఖర్చును తగ్గించుకోవడం సాధ్యపడలేదు. అందుచేత ఆదాయం, ఖర్చుల పెరుగుదలల మధ్య సమతుల్యతను సాధించడానికి కృషి జరగాలి. జీరో బడ్జెట్ విధానం అందుకు తోడ్పడుతుంది. 15 పెద్ద రాష్ట్రాలలో, ఎక్కువలో ఎక్కువ ఆర్థిక సూచికల విషయంలో రాష్ట్రం సుమారుగా మధ్యస్థానంలో వుంది. ○

(6వ పేజీ తరువాయి)

కాపాడుకోవడం, నిరంతరం అభివృద్ధి చేసుకునే విధంగా విధానాలు రూపొందించుకుంటుండగా, దానికి వ్యతిరేకమైన దిశలో దోపిడీ ఉత్పత్తి సంబంధాలను రద్దుచేసే స్వభావంతో, అంటే సమాజంలో అసమానత్వానికి దారితీసే దోపిడీ ఆర్థిక వ్యవహారాల్ని నిర్మూలించడం ద్వారా సర్వమానవ సమానత్వానికి దారితీసే దోపిడీరహిత ఆర్థిక వ్యవహారాల్ని నెలకొల్పాలనే లక్ష్యంతో మరొకరకమైన రాజకీయాలు పనిచేస్తుంటాయి. మొదటిరకం రాజకీయాలకు, లాభం, వడ్డీ, కౌలు, కమీషన్‌ల మీద ఆధారపడే యజమానులవర్గం ప్రతినిధి అయితే, రెండోరకమైన రాజకీయాలకు శ్రామికవర్గం ప్రతినిధి. ఈ మొత్తం సారాంశం నుండి అర్థం చేసుకోవలసినదేమంటే దోపిడీ ఉత్పత్తి సంబంధాల పునాదిగల సమాజంలో ఉపరితల నిర్మాణమైన రాజ్యం, దాని రూప వ్యక్తీకరణ అయిన ప్రభుత్వం, దాని సర్వాంగాలైన, చట్టసభలు, పరిపాలనా ఉద్యోగ వ్యవస్థ, న్యాయస్థానాలు, జైళ్ళు లాంటివాటితో పరిపాలన పేరుతో చేసే కార్యక్రమం అంతా దోపిడీని నిలబెట్టడం, నిరంతరం అభివృద్ధి చేయడంగానే ఉంటుంది. కాబట్టి అవినీతి ఉత్పత్తి సంబంధాల పునాదిగల సమాజంలో నీతివంతమైన ఉపరితల నిర్మాణాన్ని (రాజకీయ వ్యవస్థ) ఆశించడం అర్థరహితం అవుతుంది. ఇది నేతిబీరలో నేతిని చలకడం లాంటిది మాత్రమే.

దోపిడీ అసమాన ఉత్పత్తి సంబంధాల పునాదిగల అవినీతి సమాజంలో ఉపరితల నిర్మాణం అయిన రాజకీయ వ్యవస్థ నీతివంతమైనదైతే ఆశ్చర్యంగాని, అవినీతికరమైనదైతే ఆశ్చర్యంలేదు. ప్రస్తుత దోపిడీ చట్టసభల వ్యవస్థలో ఒక పుచ్చలపల్లి సుందరయ్య గాని, ఒక తరిమెలనాగిరెడ్డి గాని కనిపిస్తే ఆశ్చర్యపడాలి గాని, ఒక రాజీవ్‌గాంధీ, ఒక బంగారులక్ష్మన్, ఒక అరుణ్‌జైట్లీ, ఒక మాయావతి, ఒక జయలలిత, ఒక పి.వి.నరసింహారావు, ఒక జార్జి ఫెర్నాండెజ్, ఒక చంద్రబాబు, ఒక కృష్ణాయాదవ్ లాంటివారు కనబడడం, ఏమంత ఆశ్చర్యం కాదు. అయితే ఇందులో ఆవేదన చెందడం, ఆందోళనకు గురికావడం ఆదర్శానికి సంబంధించిన స్పందనలుగానే అర్థంచేసుకోవాలి. కాని వట్టి ఆందోళన, ఆవేదనైతే సరిపోదు. దోపిడీ ఆర్థిక వ్యవస్థను మార్చుకునేదిశగా ప్రజల్ని చైతన్య పరచడం మాత్రమే అందుకు సరియైన పరిష్కారమార్గం. ○

నిత్యజీవితంలో బహుళజాతి సంస్థలు - 4

— ఎన్. వేణుగోపాల్

మన జీవితంలో బహుశా అన్నిటికన్నా ఎక్కువగా బహుళజాతి సంస్థలు ఎదురుపడే రంగం సబ్బుల రంగం. శరీర శుభ్రతకు ఉపయోగించే ఒంటిసబ్బులుగాని, షాంపూలుగాని, దుస్తుల శుభ్రతకు ఉపయోగించే బట్టల సబ్బులుగాని, పౌడర్లుగాని అత్యధిక భాగం బహుళజాతి సంస్థల ఉత్పత్తులే. మారుమూల గ్రామీణ ప్రాంతాల కిరాణా దుకాణాలలోకి కూడా ఈ సబ్బుల రూపంలో బహుళజాతి సంస్థలు ప్రవేశించాయి.

శరీర శుభ్రతకూ, బట్టల శుభ్రతకూ అవసరమైన పదార్థాలను వాడడం మనకేమీ కొత్తకాదు. ఆ పదార్థాల తయారీలో అతి క్లిష్టమైన, విదేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిన సాంకేతిక పరిజ్ఞానం కూడా ఏమీలేదు. కాని బ్రిటిష్ వలసపాలన కాలంలో కేవలం మన సంపదను దోచుకుపోయే మార్గంగా మొదలైన ఈ బహుళజాతి సంస్థల సబ్బుల వ్యాపారం ఇవాళ దేశవ్యాప్తంగా పది, పదిహేనువేల కోట్ల రూపాయల పరిశ్రమగా ఎదిగిపోయింది. ఇబ్బడిముబ్బడిగా లాభాలు ఉండే ఈ రంగం ప్రధానంగా బహుళజాతి సంస్థల చేతుల్లోనే వుంది.

మన శీతోష్ణస్థితి వల్ల, వాతావరణం వల్ల మనం శరీర శుభ్రత గురించి, దుస్తులశుభ్రత గురించి ఎక్కువశ్రద్ధతీసుకోవలసివుంటుంది. అందువల్లనే మన సంస్కృతిలో శరీరాన్ని, దుస్తులను పరిశుభ్రం చేసే పదార్థాల గురించి, సాంకేతిక విధానాల గురించి ఆలోచన మొదటినుంచీవుంది. బంకమన్ను, ఆకులు, చెట్ల బెరళ్ళు, సున్నిపిండి వంటి మౌలిక పదార్థాలు, ఔషధ తైలాల వంటి తయారుచేసిన పదార్థాల వంటివెన్నో ఎన్నోతరాల ప్రయోగాల తర్వాత కనిపెట్ట బడ్డాయి. అట్లాగే బట్టల పరిశుభ్రతకు సోడియం పేరుకునే చవుడును వాడడంతో సహా అనేక పద్ధతులను మన సమాజం, ముఖ్యంగా చేతివృత్తుల కులాలు కనిపెట్టాయి

క్రమక్రమంగా ఒంటి సబ్బులలోకి జంతువుల కొవ్వు, తైలాలు, క్షార పదార్థాలను కలిపి బిళ్ళలుగాచేసే విధానం వచ్చింది. ఆ తర్వాత జంతువుల కొవ్వుస్థానంలో వృక్షజాతుల నుంచి సేకరించిన కొవ్వుకు సమానమైన జిగురు వాడకం హెచ్చింది. అట్లాగే బట్టల సబ్బుల తయారీలో రసాయనిక పదార్థాల వాడకం పెరిగింది.

ఈ సాంకేతిక విధానాలు వేరువేరుదేశాలలో అభివృద్ధి చెంది నప్పటికీ వీటిలో ఇతరులు నేర్చుకోవడానికి వీలులేనంత సంక్లిష్టత ఏమీలేదు. పైగా సబ్బులతయారీలో వాడే ముడిసరుకులు ప్రపంచంలో అన్నిచోట్లా దొరికేవే. మరీ ముఖ్యంగా కాయగూరల నుంచి సుగంధ మొక్కల నుంచి, పూల నుంచి సంగ్రహించే తైలాలు, సోడా ఉప్పు తదితర రసాయనాలు భారతదేశంలో విస్తారంగా లభించేవే. కనుక అటు సాంకేతిక విధానం కోసం గాని, ఇటు ముడిసరుకుల కోసం గాని భారత ఆర్థికవ్యవస్థ విదేశీ, బహుళజాతి సంస్థలమీద ఆధారపడ వలసిన అవసరమేమీ లేదు.

కాని ఒంటిసబ్బుల, బట్టలసబ్బుల విషయంలో భారతదేశపు మార్కెట్ ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్. దేశవ్యాప్తంగా సాలీనా 6 లక్షల టన్నుల వంటిసబ్బులు, 30 లక్షల టన్నుల బట్టల సబ్బులు, పౌడర్లు వాడకమవుతున్నాయని ఒక అంచనా. వీటివిలువ ఒంటి సబ్బులవిషయంలో ఐదువేల కోట్లరూపాయలు కాగా బట్టలసబ్బుల, పౌడర్ల విషయంలో మరొక ఐదువేలకోట్ల రూపాయలు వుంటుంది.

అయితే ఈలెక్కలు కేవలం సంఘటితరంగానికి సంబంధించినవి మాత్రమే. సంఘటిత రంగంలో కూడా తీవ్రమైన వ్యాపారపోటీవల్ల గణాంకాలు ఉజ్జాయింపుగా చెప్పేవే గాని ఖచ్చితమైన స్థితికి అద్దం పట్టేవి కావు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఎంతోకొంత అసంఘటిత రంగం, స్థానిక చిన్న పారిశ్రామికవేత్తల ఉత్పత్తులు పనిచేస్తుండడం వల్ల దేశపు సబ్బుల వ్యాపారాన్ని నిర్దుష్టంగా అంచనావేయడం సాధ్యం కాదు.

దేశంలో వంటిసబ్బుల వ్యాపారం పరిమాణం రీత్యా 7-8 శాతం పెరుగుదలతో, విలువ రీత్యా 15 శాతం పెరుగుదలతో ఉందని 1999 నాటి అంచనాలు తెలుపుతున్నాయి. పరిమాణం పెరుగుదలకూ విలువ పెరుగుదలకూ మధ్య ఇంత వ్యత్యాసం ఉందంటే, సబ్బుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని అర్థం. దీనికి వ్యాపారవేత్తలు చెప్పేసమాధానం ఇటీవలికాలంలో మధ్యరకం, ఖరీదైన సబ్బులకు వేరువేరు ఎక్సైజ్ పన్నులుండేవి. అందువల్ల చౌకరకం సబ్బుల మార్కెట్ విస్తారంగా ఉండేది. నూతన ఆర్థిక విధానాలలో భాగంగా 1993లో ఈపన్నులతేడాను తొలగించడంతో మధ్యరకం, ఖరీదైన సబ్బుల వ్యాపారం పెరిగిపోయింది.

ఒంటిసబ్బుల మార్కెట్‌లో ప్రధానమైన వ్యాపార సంస్థలు హిందుస్తాన్ లివర్ లిమిటెడ్, నిర్మా, గోద్రెజ్ సోప్స్ లిమిటెడ్, ప్రాక్టర్ అండ్ గాంబిల్, జాన్సన్ అండ్ జాన్సన్, రెకిల్ అండ్ కాల్‌మన్, పార్క్‌డివిస్, టాటా, విప్రో.

వీటిలో నిర్మా మినహా మరే సంస్థనీ స్వదేశీ సంస్థగా చెప్పడానికి వీలులేదు. గోద్రెజ్ సోప్స్, టాటాలు స్వదేశీ సంస్థలుగానే ప్రారంభ మైనప్పటికీ, విదేశీ, బహుళజాతి సంస్థలతో ఏదోఒకరకమైన ఒప్పందాల ద్వారా బహుళజాతి సంస్థల వ్యాపారవలయంలో భాగమై

పోయాయి. వీటిలో గోద్రెజ్ సోప్స్ ప్రాక్టర్ అండ్ గాంబిల్‌తోనూ, టాటా హిందుస్తాన్ లివర్‌తోనూ కలిసిపోయాయి.

అయితే వంటిసబ్బుల తయారీలో పేరుకు డజనుదాకా సంస్థలు ఉన్నప్పటికీ మొత్తం మార్కెట్‌లో 72 శాతం హిందుస్తాన్ లివర్ చేతుల్లోనే ఉంది.

ఒంటిసబ్బుల స్థానంలో ద్రవరూప వంటిసబ్బు వాడకం కూడా ఈమధ్యనే ప్రారంభమైంది. పన్నెండు వందల టన్నుల వినియోగంలో రూ.24 కోట్ల వ్యాపారంగా ఉన్న ఈ రంగం మొత్తంగా హిందుస్తాన్ లివర్, రెకిట్ కోల్‌మన్ వంటి బహుళజాతి సంస్థల చేతుల్లోనే వుంది.

ఇక బట్టల సబ్బుల విషయానికొస్తే, దేశంలో 20 శాతం వినియోగ అవసరాలను స్థానిక, చిన్న పారిశ్రామిక సంస్థల, అసంఘటిత రంగమే తీరుస్తోంది. సంఘటిత రంగంలో ప్రధాన వ్యాపార సంస్థలు హిందుస్తాన్ లివర్, నిర్మా, ప్రాక్టర్ అండ్ గాంబిల్, హెంకెల్ స్పిక్, గోద్రెజ్ సోప్స్, విప్రో.

ఈ రంగంలో కూడా పేరుకు అరడజనుకు పైగా ఉత్పత్తిదారులు ఉన్నప్పటికీ 28 శాతం మార్కెట్, 47 శాతం ఆదాయం ఒక్క హిందుస్తాన్‌లివర్ చేతుల్లోనేఉంది. 1980లలో ప్రవేశించిన దేశీయ సంస్థ నిర్మా హిందుస్తాన్ లివర్‌తో పోటీపడుతూ బట్టల సబ్బుల మార్కెట్‌లో రెండో స్థానానికి చేరింది గాని ఏటేటా ఈ రెండు సంస్థల మధ్య నువ్వా నేనా అనేంత తీవ్రమైన పోటీ కొనసాగుతుంది. నిర్మాకు దేశీయ మార్కెట్‌లో 25% వాటా వుండగా మార్కెట్ విలువలో మాత్రం 28% వాటా ఉంది. అంటే పరిమాణంలో 3% తేడా విలువలో 20% తేడాగా మారింది. దీనర్థం బహుళజాతి సంస్థతో దేశీయ సంస్థ పోటీపడే సందర్భంలో కూడా అది ఆర్జించగలిగే ఆదాయం చాలా తక్కువగా ఉంటుంది.

ఔరా!

* దేశంలో టూత్‌పేస్టులమీద చేస్తున్న ఖర్చు 2100 కోట్లు!
* పారిస్‌నుంచి మనదేశంలోకి వచ్చిన జాకస్ డెస్సాంగ్ అనే హెయిర్‌స్పెషలిస్టుముంబాయిలోని తాజ్ హోటల్లో కేవలం క్షవరం కోసం వసూలు చేస్తున్నది 1400 రూపాయులు మాత్రమే!
* దేశంలోమనమందరంఐస్‌క్రీమ్ కోసం చేస్తున్న ఖర్చు 948 కోట్లు!

1950ల్లో బట్టల సబ్బుల మార్కెట్లోకి బహుళజాతి సంస్థల ప్రవేశం విపరీతంగా పెరిగింది. స్థానిక చిన్నఉత్పత్తిదార్లను కొనివేస్తూ వాళ్ళ మార్కెట్లను దెబ్బతీసి వాళ్ళను దివాళా తీయిస్తూ క్రమక్రమంగా ఈ బహుళజాతి సంస్థలు దేశీయ మార్కెట్లో 60 శాతం పైగా ఆక్రమించుకోగలిగాయి. అయినప్పటికీ దేశ తలసరి బట్టల వినియోగం ఇతర దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. మలేషియా, ఫిలిప్పైన్స్‌లలో సగటు వార్షిక వినియోగం 3.7 కిలోలు, తైవాన్‌లో 4 కిలోలు, అమెరికాలో 10 కిలోలు కాగా భారత్‌లో అది 3.2 కిలోలు మాత్రమే. అంటే ఒక్కకిలో సగటు వినియోగం పెరిగినా లక్షటన్నుల మార్కెట్ పెరుగుతుంది.

సబ్బులు గాని, పౌడర్ గాని స్థానిక చిన్న ఉత్పత్తిదారులు పదిహేను రూపాయలకు కిలో అమ్మగలుగుతుండగా బహుళజాతి సంస్థలు, స్వదేశీ గుత్త సంస్థలు 60 రూపాయల నుంచి 150 రూపాయలకు అమ్ముతున్నాయి. ఈ లెక్కన ఉన్న మార్కెట్‌లోనే విపరీతమైన లాభాలకు అవకాశం వుంది. పోటీదార్లను దెబ్బతీసి తమ మార్కెట్ పెంచుకున్నా, అసంఘటితరంగంలోకి వినియోగదార్లను తమ చేతుల్లోకి తెచ్చుకున్నా, కొత్త మార్కెట్ సృష్టించుకోగలిగినా ఈ సబ్బుల తయారీదార్లకు లాభాల పంట ఇంకా ఇనుమడిస్తుంది.

అందుకే బహుళజాతి సంస్థలని ఇటువంటి సబ్బుల మార్కెట్ లోను, అటు బట్టల సబ్బుల డిటర్జెంట్ పౌడర్‌ల మార్కెట్‌లో ఈ మూడురకాల చర్యలకు పూనుకుంటున్నాయి.

మొదటిదిగా స్థానిక చిన్న ఉత్పత్తిదార్లను దెబ్బతీసేందుకు చిన్న పట్టణాల మార్కెట్‌లోకి, గ్రామీణ మార్కెట్లోకి బహుళజాతి సంస్థలు దూకుడుగా వస్తున్నాయి. గ్రామీణ మార్కెట్లకు అవసరమైన చిన్న పరిమాణపు సబ్బులను, పౌడర్‌ప్యాకెట్లను విడుదలచేయడం గ్రామీణ ప్రాంతాల వ్యాపారస్థులకు ఎక్కువకమీషన్లు, ప్రోత్సాహకాలు ఇవ్వడం, మారుమూల ప్రాంతాలకు కూడా నిరంతర సరఫరా ఉండేటట్లు గోడౌన్లను ఏర్పాటు చేసుకోవటం వంటి పనులు చేస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యసంస్థలచేత స్థానిక ప్రభుత్వాలకు అప్పులిచ్చే టప్పుడు గ్రామీణ ప్రాంతాలకు మంచి రోడ్ల సౌకర్యం కల్పించమనే షరతుపెట్టి తమ సరుకుల నిరంతర సరఫరాకు ఏర్పాటు చేస కుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌నే ఉదాహరణగా తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వంతో మిలాఖతై హిందుస్తాన్ లివర్ సంస్థ తమ సరుకులను డ్వాక్రా గ్రూపులచేత అమ్మించే ఒప్పందం చేసుకున్నాయి.

దీనివల్ల మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా "నాణ్యమైన సరుకులు అందుతాయనే" ఒకభ్రమ ప్రచారంలో ఉంది. ఈ భ్రమలోని నిజానిజాలను మరొకసారి చర్చిద్దాం గాని ఈ బహుళ జాతి సంస్థల సరుకుల చొరబాటు వల్ల గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో జరుగుతున్న మార్పు ఏమంటే స్థానిక జిల్లా పారిశ్రామిక కేంద్రాలలో గాని, ఇతరంగా గాని చిన్న చిన్న పారిశ్రామికవేత్తలు సహకారరంగం ఏర్పాటుచేసుకున్న సబ్బుల కార్ఖానాలు మూతబడిపోతాయి. అంటే ప్రజలకు తక్కువధరకు దొరుకుతున్న ఈ సరుకులు అందకుండా పోతాయి. ఆ కార్ఖానాల్లో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోతారు. అంత గొప్ప సంక్లిష్టమైన సాంకేతిక విధానమేమీ కానప్పటికీ కొత్త

(తరువాయి భాగం 14వ పేజీలో)

మార్క్సిస్టు పారిభాషిక పదకోశం - 1

అరాచకవాదం

— డి. పాపారావు

రాజకీయ అధికారాన్ని నిరాకరించే సిద్ధాంతం మరియు ఉద్యమమే అరాచకవాదం. అంటే రాజకీయ అధికారం అవసరం లేకుండానే సామాజికంగా సుస్థిర వ్యవస్థను స్థాపించడం సాధ్యమేనని ఈ సిద్ధాంతం చెబుతుంది. ఆధునిక రాజ్యం తాలూకు భౌగోళిక (సరిహద్దులు), సార్వభౌమాధికారం, దాని అధికారాన్ని కొనసాగించు కునేందుకు అది వినియోగించే భౌతిక వత్తిడిల తాలూకు వ్యవస్థలపై గుత్తాధిపత్యం, చట్టాలు, మొదలైనవాటన్నిటిని అరాచకవాదం తిరస్కరిస్తుంది. స్వయం నియంత్రణా స్వభావం గల సమాజంగా చెప్పబడేది అరాచకవాదపు లక్ష్యం.

అరాచకవాదంలో రెండు ప్రధాన తరహాలవి ఉన్నాయి. మొదటిది వ్యక్తిగతవాద అరాచకవాదం, రెండోది సోషలిస్టు అరాచకవాదం. వీటిలో మొదటిది వ్యక్తిగత స్వేచ్ఛను ఉద్ఘాటిస్తుంది. తద్వారా అది వ్యక్తి సార్వభౌమాధికారాన్ని ప్రైవేటు ఆస్తి తాలూకు ప్రాధాన్యతకు గుత్తసంస్థల వ్యతిరేకతను ఉద్బోధిస్తుంది. కాబట్టి ఈ తరహా అరాచకవాదాన్ని 'పెట్టుబడిదారీ అరాచకవాదం' అనవచ్చు. ఇక సోషలిస్టు అరాచకవాదం ప్రైవేటు ఆస్తిని తిరస్కరిస్తుంది. దానితోపాటుగా రాజ్యాన్ని కూడా సామాజిక అసమానతకు ప్రధాన మూలంగా భావిస్తూంది అంటే ఈ తరహావాదం సోషలిజంతో, ఉదారవాదాన్ని మిళితం చేస్తుంది. కాబట్టి దీనిని ఉదారవాద సోషలిజం అనవచ్చు.

విలియం గోడ్రిన్ అనే పద్దెనిమిది, పందొమ్మిది శతాబ్దాలలో జీవించిన అరాచకవాద సిద్ధాంతకారుడు మొట్టమొదటిసారిగా అరాచకవాదాన్ని ఒక క్రమరూపంలో ప్రతిపాదించాడు. అయితే విస్తృత సోషలిస్టుఉద్యమంలో అంతర్భాగంగా అరాచకవాదం ప్రౌఢా సిద్ధాంతీకరణలతో ఆరంభం అయ్యింది. ఈ సూత్రీకరణలనే సాంప్రదాయక అరాచకవాదపు ఆరంభంగా భావించవచ్చు. ఈయన సూత్రీకరణల ప్రకారం రాజ్యాధికారాన్ని ఉపయోగించడం ద్వారా కార్మిక వర్గం తననితాను విముక్తి చేసుకోలేదు. దీనితోపాటుగా పెట్టుబడి తాలూకు ఆధిపత్యం, రాజ్యం తాలూకు అధికారం కవలల వంటివని ప్రౌఢా అభిప్రాయం. ఈ అభిప్రాయాలకు అనుగుణంగానే 1860వ దశకంలో బాకూనిన్ నాయకత్వంలో అరాచకవాదం మార్క్సిస్టు సోషలిజానికి పోటీగా అంతర్జాతీయస్థాయిలో ఆవిర్భవించింది.

ఇక అనంతరం బాకూనిన్ వారసుడైన పీటర్ క్రోపాట్కి (1842-1921) అరాచకవాద కమ్యూనిజాన్ని అభివృద్ధి చేశాడు. దీని ప్రకారంగా 'ప్రతిదీ ప్రతివారికి చెందుతుంది. అలాగే సామాజిక పంపిణీ అనేది కేవలం వ్యక్తుల అవసరాలపై ఆధారపడి వుంటుంది, బాకూనిన్ వ్యూహం ప్రకారంగా అణచివేయబడ్డ వర్గాలు రాజ్యంపై సద్యోజనితంగా (స్పాంటేనియస్‌గా) తిరగబడతాయి. ఫలితంగా రాజ్యాధికారం రద్దవుతుంది. దాని స్థానంలో స్వయం ప్రతిపత్తిగల కమ్యూన్‌లు ఏర్పడతాయి.

1871వ సంవత్సరం పారిస్ కమ్యూన్ ఈ అరాచకవాద విప్లవ నమూనాకు సన్నిహితంగా వచ్చింది. అయితే ఈ విప్లవం అణచివేయబడడం తెలిసిందే. మార్క్సు సహచరుడు అయిన ఎంగెల్స్ అభిప్రాయంలో కేంద్రీకరణ లేకపోవడం, అధికారాన్ని వినియోగించు కోకపోవడం, అలాగే తగినంత స్వేచ్ఛగా ఉద్యమకారులు నియంతృత్వ అధికారాన్ని వినియోగించుకోకపోవడం మొదలైనవన్నీ ఈ కమ్యూన్ పరాజయానికి కారణాలే. ఈ విప్లవం పరాజయం అనంతరం మార్క్సిస్టు తరహా రాజ్యాధికార సోషలిజం ప్రాచుర్యాన్ని పొందింది. ఇక అనంతరం పలువురు అరాచకవాదులు రాజకీయ నాయకులను హత్యచేయడం వంటి కార్యకలాపాలకు దిగసాగారు. తద్వారా విస్తృత ప్రజారాసుల విప్లవ తిరుగుబాట్లకు ప్రోత్సాహాన్ని ఇవ్వగలమని వారు భావించారు. అయితే ఈ ఉద్యమంపై తీవ్రమైన అణచివేత రావటం మూలాన, ఉద్యమంలోని కొందరు ఇతర అరాచకవాదులు సిండికలిజం అనే తరహా ప్రత్యామ్నాయ వ్యూహాన్ని అభివృద్ధిపరిచారు. దీని ప్రకారంగా కార్మిక సంఘాలను విప్లవ పనిముట్లుగా మార్చాలి. అంటే సోషలిస్టు వ్యవస్థకు కమ్యూన్‌లకు గాక కార్మిక సంఘాలను మౌలిక పునాదిగా (యూనిట్) మార్చాలి. కాబట్టి ఇక అరాచకవాద విప్లవం అనేది కార్మికుల సాధారణ సమ్మె రూపంలో ఆరంభించాలని, తద్వారా జరిగిన విప్లవ క్రమంలో ఉత్పత్తి సాధనాలకు, పంపిణీ, వస్తుమార్పిడిని కార్మికులు అదుపు చేయాలని, వీటన్నింటితో పాటుగా రాజ్యాన్ని రద్దుచేయాలని సిండికలిస్టులు భావించారు.

విప్లవ, ప్రగతిశీల ఉద్యమాలలో విరివిగా వినియోగం వున్న పారిభాషిక పదాలను వివరించడానికి ఈ కొత్త శీర్షిక ప్రయత్నిస్తుంది - సం

ఈరకమైన సిండికలిస్టు అరాచకవాదం తాలూకు ప్రభావం 1895 నుంచి 1920 వరకు కార్మిక, సోషలిస్టు ఉద్యమాలలో భారీగా కొనసాగింది. అనంతరం 1960వదశకపు నూతనవామపక్ష ఉద్యమ స్రవంతిలో (న్యూ లెఫ్ట్ మూవ్‌మెంట్) అరాచకవాద ధోరణులు, ఏదోఒకరూపంలో గమనార్హంగా పునరుద్ధరించబడ్డాయి. ప్రస్తుతం క్రైస్తవ అరాచకవాద సాంప్రదాయంనుంచి స్ఫూర్తిని పొందిన అరాచకవాద-శాంతియుతవాదం (దీనికి ప్రధానస్ఫూర్తి: మహాత్మాగాంధీ ప్రాచుర్యంలోనికి తెచ్చిన శాంతియుత ప్రత్యక్షకార్యాచరణ పద్ధతులు) పాశ్చాత్య దేశాల శాంతిఉద్యమాల్లో ఒక ప్రధానమైన ధోరణి.

అరాచకవాదంపై మార్క్సిజం విమర్శ

మ్యాక్స్ స్టిర్నర్ (1805-57), ప్రౌధా, బాకూనిన్ వంటివారు వ్యక్తీకరించిన వ్యక్తిగతవాద, సోషలిస్టు అరాచకవాదాలు రెండింటిపైన విస్తృతమైన విమర్శ అవసరమేనని మార్క్సు ఎంగెల్స్‌లు భావించారు. మార్క్సు ఎంగెల్సులు అరాచకవాదాన్ని పెట్టీ బూర్జువా ధోరణిగా భావించారు. బాకూనిన్ విషయంలో దీనిని దుస్సాహసవాదంగానూ, అన్యవర్గ ధోరణులను విడనాడామనుకున్న మేధావుల విప్లవ వాగాడంబరంగానూ వారు చూశారు. సోషలిస్టు ఉద్యమంలోనే అంతర్గతంగా ఉన్న కాలంచెల్లిన 'ఒంటెత్తు'ధోరణిగా అరాచకవాదాన్ని మార్క్సిజం భావిస్తుంది. అంటే భారీస్థాయిలో పెట్టుబడిదారీ వ్యవస్థ కేంద్రీకృత రాజ్యం (బూర్జువాల ప్రయోజనాలను కాపాడే) అభివృద్ధిపై పెట్టీబూర్జువా వర్గపు నిరసనకు అరాచకవాదం ప్రతిబింబం. అంతే కాకుండా కార్మికుల విముక్తి పోరాటంలో తప్పనిసరి అవసరమైన స్వతంత్ర కార్మికవర్గపార్టీ నాయకత్వంలో రాజకీయకార్యాచరణద్వారా రాజ్యాధికారాన్ని కైవసం చేసుకోవడం (తక్షణం రాజ్యాధికారాన్ని ధ్వంసం చేయడంగా) అవసరాన్ని అరాచకవాదం తిరస్కరిస్తుంది. దీనికిగాను ఎంగెల్స్ వివరించిన ఈ అంశం ప్రాధాన్యత గలది. కమ్యూనిస్టుల దృష్టిలో రాజ్యాన్ని రద్దుచేయడం అంటే అది వర్గాల రద్దు తాలూకు తప్పనిసరి ఫలితంగా మాత్రమే అర్థవంతమైనది. వర్గాల అంతర్ధానంతో మాత్రమే వ్యవస్థీకృత అధికారికంగా ఒక వర్గపుపాలన ముగియగలదు. అంటే, లోతుగాచూస్తే, మార్క్సిజం, అరాచకవాదాల మధ్య ఉన్న తేడాలు రాజ్యం తాలూకు స్వభావం, రాజ్యానికి సమాజం తోనూ, పెట్టుబడితోనూ ఉన్న సంబంధం, పరాయికరణ రూపంగా రాజకీయాలను అధిగమించడం ఎలా వంటివి. ❍

(12వ పేజీ తరువాయి)

సాంకేతిక విధానంలో తమకు తెలియని తాము అర్థం చేసుకోలేని వ్యాపార చక్రంలోని సరుకులను హెచ్చు ధరలకు ప్రజలు కొనుక్కోవలసిన స్థితి వస్తుంది.

ఇది ఆర్థికవ్యవస్థ మీద ప్రభావం వేయడం మాత్రమేకాక సామాజిక జీవనం మీద కూడా ప్రభావం వేస్తుంది.

రెండోస్థాయిలో పోటీదార్లను దెబ్బతీయడానికి ఉత్పత్తిదార్ల మధ్య జరిగే పోరాటంలో 'ఆంబోతుల పొట్లాటలో లేగల కాళ్ళు విరిగినట్లు' ప్రజాజీవితం కల్లోలానికి గురైతుంది. ఒక ఉదాహరణ చెప్పాలంటే కేవలం సబ్బుల పరిశ్రమలో పోటీదార్ల మార్కెట్‌ను ఆక్రమించుకోవడానికి ప్రతి సంస్థ చేసే కుటిల ప్రయత్నాలలో భాగమైన వ్యాపార ప్రకటనల మీద కనీసపక్షం 1500 కోట్ల రూపాయలు వ్యయం అవుతున్నాయి. కడుపు నిండుతుందా, కాలు నిండుతుందా కేవలం తమ సరుకులు కొనేలా ఆకర్షించడానికి తప్ప మరెందుకూ ఉపయోగపడని వ్యాపార ప్రకటనల మీద ఇంత భారీ ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. ఈ ప్రకటనల మీద వ్యర్థం అయ్యే లేదా తమ సరుకులను ఎక్కువగా అమ్మడానికి వ్యాపార నిచ్చెనలో ఒక్కొక్క స్థాయికి ఇచ్చే కమీషన్లకు అవసరం అయ్యే వేలాది కోట్ల రూపాయలను ఈ సరుకుల ధరల్లోనే భాగం చేశారు. అందువల్లనే రెండు రూపాయలకు మించని ఉత్పత్తి వ్యయంతో తయారయ్యే సబ్బులను 10 రూపాయలకు, 10 రూపాయల ఉత్పత్తి వ్యయంతో తయారయ్యే బట్టల పౌడర్లను 60 రూపాయలకు పైగా అమ్ముతున్నారు.

ఇక్కడినుంచి మూడోస్థాయికి వెళితే వ్యాపార ప్రకటలను పోటీదార్లను దెబ్బతీయడమే కాక కొత్త మార్కెట్లను సృష్టించడానికి, ఆక్రమించడానికి కూడా వాడుకున్నారు. ఇప్పటివరకు ఒంటిసబ్బుల, బట్టల సబ్బుల అవసరం లేకుండా బతికిన ప్రజా సమూహాలకు వాటిని మెప్పేందుకు ఈ ప్రకటనలను వాడుకుంటున్నారు. ఈ సరుకుల ఖరీదు ఎక్కువని అందువల్ల తాము వాడతామని దూరంగా ఉన్న ప్రజాసమూహాలను ఆకర్షించి మభ్యపెట్టేందుకు చిన్న చిన్న ప్యాకేజీల్లో 25 గ్రాముల సబ్బులు, 10 గ్రాముల సబ్బులు, 25 గ్రాముల పౌడర్లు, రూపాయికి పౌడర్ ప్యాకెట్లు వంటి కొత్త ఎత్తుగడలు పన్నుతున్నారు. వీటివల్లఏమాత్రం కొత్తమార్కెట్ ఏర్పడినా అది పూర్తిగా తమ గుప్పిట్లోనే ఉంటుందని ఆశపడుతున్నారు.

మొత్తంమీద మన శరీరం మన బట్టలు మన శరీర బట్టల శుభ్రత బహుళజాతి సంస్థల కుట్రలకు వ్యాపారానికి పోరాటాలకు రంగస్థలాలయ్యాయి. మూడువేల కోట్ల రూపాయల వార్షిక ఆదాయంతో అందులో కనీసం నాలుగోవంతు లాభాలతో హిందుస్తాన్ లివర్ నిజంగా అందిస్తున్న సరుకులు సేవలు మన మురికిని వదులగొట్టడానికి కాదు. దీని ప్రధాన లక్ష్యం మన మురికిని రూపాయల్లోకి మార్చుకోవడం ఆ క్రమంలో మన మురికి కూడా వదులు తుండవచ్చు గాని ఆ పనికోసం మనం ఒక విదేశీ సంస్థమీద ఆధారపడి దానికి వేలకోట్లు దోచిపెట్టనక్కరలేదు. ❍

భారత ప్రజాస్వామ్యానికి అవినీతి చెదలు

— చిక్కుడు ప్రభాకర్

నాటి లాల్‌బహదూర్ శాస్త్రి, నేటి నృపేన్‌చక్రవర్తి (త్రిపుర మాజీ ముఖ్యమంత్రి)లాంటి ప్రజాపాలకులు నేటి రాజకీయవ్యవస్థలో కాగడా పట్టివెదికినా కనిపించరు. ప్రజాస్వామిక వ్యవస్థమీద నమ్మకంతో పైసా అవినీతికి పాల్పడకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలనను అందించే ప్రయత్నం చేసి అలసిన ఈ నాయకులు తమ పదవులు ఊడిన తర్వాత తమకంటూ ఈ ప్రపంచంలో స్వంతఆస్తి లేనితరుణంలో ఎక్కడికి పోవాలో తెలియక ఇళ్ళకు, వృద్ధాశ్రమానికి పోయారు. నేటికి త్రిపుర మాజీ ముఖ్యమంత్రి అయిన నృపేన్‌చక్రవర్తి వృద్ధాశ్రమంలో బ్రతుకు వెళ్ళబుచ్చుతున్నాడు. ఇటువంటి నాయకులు కోటికి ఒక్కరుంటే ప్రస్తుత వ్యవస్థలో నూటికి తొంభైతొమ్మిది శాతం మన ప్రజానాయకులు ఎంతోకొంతనుండి వేలకోట్లవరకు అవినీతికి పాల్పడుతూనే వున్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వం విద్యావంతులు సమాజం గూర్చి, ప్రజల బాగోగుల గూర్చి ఆలోచించి తమప్రాణాలను సైతం ఫణంగా పెట్టి రాజకీయాలలో చేరి బ్రిటిష్‌వారి తూటాలకు బలికాగా, నేటి రాజకీయనాయకులు మాత్రం ప్రజల ప్రాణాలను, వారి బాగోగులను తూటాలతో మట్టుపెట్టి పీకలవరకు అవినీతిలో మునిగిపోతున్నారు. నేడు రాజకీయాలలో చేరడమంటేనే అవినీతికి పాల్పడడం కొరకు చేరడం, అధికారం కాపాడుకునేందుకు ఎంతటి దుర్మార్గానికైనా పాల్పడటం సర్వసాధారణమైపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే "అవినీతి అనే రక్తంతో నేటి వ్యవస్థ అనే శరీరం" బ్రతుకునీడుస్తున్న రోజులివి. గత కొన్ని దశాబ్దాలుగా అవినీతిలో మునిగిపోయిన కాంగ్రెస్‌పార్టీ భారతప్రజల జీవనాన్ని ఛిన్నాభిన్నం చేసింది. కోట్లాది ప్రజల జీవన ప్రమాణాలు పెంచేదిశగా తీసుకోవలసిన చర్యలకు చరమగీతం పాడి మొక్కుబడిగా ఇరవై సూత్రాల కార్యక్రమం, గరీబి హటావో లాంటి నినాదాలతో అధికారం కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నించింది.

ఇటువంటి తరుణంలోనే దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలకు తాము స్వచ్ఛమైన పాలనను అందిస్తామని జనసంఘ్, జనతా, ఇతర ప్రాంతీయ పార్టీలు ప్రజల ముందుకు వచ్చాయి. కాంగ్రెసు పూర్తిగా అవినీతిలో మునిగిందని, కాంగ్రెసును నమ్ముకుని దశాబ్దాలుగా వెనుకబడ్డామని, దేశాన్ని అభివృద్ధిచేయుటకు కాంగ్రెసేతర పార్టీల ప్రభుత్వాలు తప్పనిసరని ప్రజలముందుకు వచ్చిన పార్టీలు "కాంగ్రెసు గుడిలో లింగాన్ని మింగితే తాము గుడినే మింగే" స్థాయికి వెళ్ళిపోయారు. ఇందిరా, రాజీవ్‌గాంధీల పరిపాలనలలో వచ్చిన కుంభకోణాల కంటే పి.వి.నరసింహారావు, వాజ్‌పేయి లాంటివారు కేంద్రంలో, లాలూప్రసాద్‌యాదవ్, కరుణానిధి, ప్రకాశ్‌సింగ్‌బాదల్, చంద్రబాబునాయుడు, జయలలిత, మాయావతి లాంటి నాయకుల రాష్ట్రాల పాలనలలో వందలాది కోట్ల, వేలాదికోట్ల కుంభకోణాలు తెరమీదికొచ్చాయి.

రాజీవ్‌గాంధీ పాలనలో బోఫోర్స్ కుంభకోణం అరవైనాలుగు కోట్లకు చేరుకోగా, పి.వి.నరసింహారావు ప్రభుత్వంలో హర్షద్‌మెహతా ప్రమేయమున్న షేర్ల కుంభకోణం అయిదువేల కోట్లకు చేరుకుంది. ఐదుసంవత్సరాలు అధికారంలో ఉండేందుకు పి.వి.నరసింహారావు పడని పాట్లులేవు, చేయని సర్కస్ ఫీట్లు లేవు. ఆఖరికి బహిరంగంగానే యం.పి.లను కొని ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండగలిగిన పి.వి.నరసంహారావు దేశవ్యాప్తంగా ఎన్నో కుంభకాణాలకు కారకుడయ్యాడు. యూరియాస్కామ్, జార్ఖండ్ యం.పి.ల కొనుగోలు, ఇంకా కేంద్రమంత్రి సుఖ్‌రామ్ అయితే ఈయన పాలనలోనే ప్రైవేటు ఆపరేటర్లకు టెలికమ్యూనికేషన్‌లను అమ్మడం వలన కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించాడు. ఆరోజు అతని బాత్‌రూమ్, బెడ్‌రూమ్‌లలో, ఫామ్ హౌజ్‌లలో కోట్లాదిరూపాయలు దొరికాయి. ఇలా ప్రజాధనాన్ని మింగడం నేటి రాజకీయ నాయకులకు "రోజూ భోజనం చేసేటువంటి ప్రక్రియ'గా సాధారణమైపోయింది.

గత కొంతకాలంగా బీహార్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, పంజాబ్‌లలో కాంగ్రెసు ప్రత్యామ్నాయ పార్టీలైన జనతాదళ్, ఎడియమ్‌కె, డియమ్‌కె, బిజెపి-బియస్‌పిల కూటమి, తెలుగుదేశం, అకాలీదళ్-బిజెపిల కూటమిలు అధికారంలో కొనసాగుతున్నాయి. కాంగ్రెస్‌పార్టీకి మించిన అవినీతికేసులలో మునిగితేలుతున్న ఈపార్టీల ప్రముఖులు లక్ష, కోటి రూపాయలలో కాకుండా పదులు, వందలు, వేలకోట్ల రూపాయల కుంభకోణాలలోనే ఇరుక్కుంటూ, పైకిమాత్రం ప్రజాస్వామ్యం గూర్చి, నీతి, న్యాయంగూర్చి చిలుకపలుకులు పలుకుతున్నారు. బీహార్‌లో లాలూప్రసాద్ వేలాదికోట్ల రూపాయల కుంభకోణం అయిన "పశువుల గడ్డి" కేసులో నిందితునిగా వుండగా, తమిళనాడును డియమ్‌కె, ఎడియమ్‌కెలు వరుసగా ఒకరికి మించి మరొకరు యధేచ్ఛగా ఆ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. పంజాబ్‌లో

(అకాలీదళ్, బిజెపి కూటమి మొన్నటివరకు కొనసాగిన ప్రకాశ్‌సింగ్ బాదల్) ప్రభుత్వంలోని ప్రముఖులఇళ్ళమీద అవినీతికిసంబంధించిన దాడులు జరుగుతూనే వున్నాయి. ప్రకాశ్‌సింగ్‌బాదల్‌అవినీతికి అంతు ఎక్కడో కనుచూపుమేరలో అగుపడడంలేదు. ఈ దాడులకు జడిసి ప్రకాశ్‌సింగ్‌బాదల్ కేంద్రప్రభుత్వ శరణుజొచ్చగా స్వయంగా ఉపప్రధానిగారు పంజాబ్‌కుపోయి బహిరంగంగానే నేడు మీరు అధికారంలో ఉంటే, రేపు మేము ఉంటాము. ఒకరికి ఒకరు సర్దుకొని ప్రజలధనాన్ని యధేచ్ఛగా దోచుకోవాలికాని ఇటువంటి దాడులేంటని అమరేందర్‌సింగ్ ప్రభుత్వాన్ని వేడుకోవడంతో ప్రస్తుతం ప్రకాశ్‌సింగ్ కుటుంబ అవినీతి ఆస్తులమీద దాడులు ఆగాయి. తాజ్ కారిడార్ అవినీతిలో మాయావతి ప్రభుత్వం కుప్పకూలిందే తడవుగా ఈ కేసులోని కొందరి అవినీతి బయటపడుతూనే వుంది.

మూడు ఎకరాల ఆసామి ఎనిమిదేళ్ళు ఆంధ్రారాష్ట్రాన్ని స్వచ్ఛమైన పరిపాలనతో ముందుకు తీసుకుపోతున్నానని, నోరుతెరిస్తే తానేకాదు తమపార్టీ కార్యకర్త నుండి ప్రభుత్వంలోని ముఖ్యుల వరకు కూడా అవినీతి అంటే ఏమిటో తెలియదని పత్రికల ముందు, మీడియాముందు మాట్లాడే చంద్రబాబుకు నేడు కృష్ణయాదవ్ "పచ్చి వెలక్కాయ"లా గొంతులో పడ్డాడు. పత్రికల ముందుకు వచ్చి నిర్భయంగా అవినీతి గురించి మాట్లాడే స్థితిలో లేదు. గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్ర పోలీసులు వచ్చి కృష్ణాయాదవ్‌ను అరెస్టుచేసే వరకు కూడా తనకు తెలియదని ప్రజలను నమ్మింపచూస్తున్న చంద్రబాబు నాలుగు సంవత్సరాల క్రితమే నమోదైన నకిలీ స్టాంపుల కేసును దర్యాప్తు పూర్తిచేయించి నేరస్తులను శిక్షించే ప్రయత్నము ఎందుకు చేయలేదంటే విలేకరుల మీదికి విరుచుకుపడతాడు. ఒక కేసు దర్యాప్తు చేస్తున్నదశలో న్యాయస్థానాలు కూడా ఏమీ మాట్లాడవు. కాని చంద్రబాబు మాత్రం దర్యాప్తును పక్కకుపెట్టి ఇక ఈ కేసులో ఇంకా ఎవ్వరులేరని ప్రజలకు బహిరంగంగా ప్రజలకు చెబుతున్నాడు అంటే ఎంతగా దర్యాప్తును ప్రభావితం చేస్తున్నాడో అర్థమవుతుంది. ఈ ఎనిమిదేళ్ళ కాలంలో రాష్ట్రానికి కనీసం యాభైఅయిదు వేలకోట్ల రూపాయలు అప్పుగా తెచ్చి ఖర్చుపెట్టిన ప్రభుత్వం ఒక వెయ్యిమంది పనిచేసే పరిశ్రమను కాని, ఒక లక్ష ఎకరాలకు నీరందించే ప్రాజెక్టుకు కాని ఈడబ్బును ఖర్చుచేయలేదు. ఈడబ్బంతా అనుత్పాదకరంగాలైన రహదారులు, బంగాళాలకే ఎక్కువమొత్తం ఖర్చుపెట్టిన ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారులు, తెలుగుదేశ ప్రముఖులు, పార్టీ కార్యకర్తల నుండి మంత్రుల స్థాయివరకు అవినీతి ఎజెండాగా పనిచేయమని రహస్య ఆదేశాలిచ్చి రేపు మళ్ళీ ఎన్నికలలో గెలవాలంటే ఈ డబ్బు మీకు అవసరమని చాటిచెప్పి అంతులేని ప్రజాధనాన్ని వారు దిగమింగేటట్టు చేసింది. వీరి అవినీతికి వివిధ శాఖల ఉన్నతాధికారులతోపాటు పోలీసుశాఖ తోడైంది. ఎక్కడ అవినీతి జరిగినా పోలీసుశాఖ కేసును తొక్కిపెట్టి ప్రజల ధనాన్ని ప్రభుత్వ పెద్దలు దోచుకోవడానికి అవకాశం కల్పించి తామూ అవినీతిలో భాగమయ్యారు. ఫలితంగా ఆంధ్రరాష్ట్రం అన్నిరంగాలలో వెనుకబడిపోయి రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, చిన్నచిన్న వ్యాపారస్తులు, రైతుకూలీలు తమ బ్రతుకును భారంగా వెళ్ళబుచ్చుతున్నారు. మరికొందరు ఆత్మస్థైర్యం దెబ్బతిని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతి పనిని, ప్రతి రంగాన్ని ప్రైవేటుపరం చేసి ఉన్నతవర్గాలను మరింతగా సంపన్నవర్గాలుగా మార్చిన ప్రభుత్వం ఇపుడు పూర్తిగా వారి ధనబలం, కండబలం, పోలీసుబలం పైన ఆధారపడి మళ్ళీ ఎన్నికలకు సమాయత్తమవుతున్న నేటి తరుణంలో నకిలీ స్టాంపుల కుంభకోణం ముందుకొచ్చింది. ఈ ముప్పైరెండు వేలకోట్ల కుంభకోణంలో ఎంతమంది తెలుగు తమ్ముళ్ళున్నారో, ఎంతమంది పోలీసు అధికారులున్నారో తేల్చి నిష్పక్షపాతంగా విచారణ పూర్తిచేసి న్యాయస్థానం ముందు దోషులను నిలబెట్టే స్వచ్ఛమైన దర్యాప్తు సంస్థ ఈ దేశంలో ఎక్కడున్నది? రాష్ట్రంలో, దేశంలోని దర్యాప్తు సంస్థలన్నీ కూడా పాలకవర్గాల చేతిలో పావులుగా మారి, వారి అడుగుజాడలలో నడుస్తున్నవారే తప్ప, నిష్పాక్షికమైన దర్యాప్తుచేసే నీతివంతుడైన అధికారిలేదు. అటువంటివారు వేళ్ళమీద లెక్కపెడదామన్నా దొరకరు. అటువంటివారే వుంటే నేడు దేశంలో, రాష్ట్రంలోని కుంభకోణాలలో ఏ ఒక్క కేసుకైనా శిక్షపడేది. కాని ఏది? ఏ కుంభకోణంలో దోషులు శిక్షింపబడ్డారు? బోఫోర్స్ కుంభకోణమా? జార్ఖండ్ యమ్.పి.ల కుంభకోణమా? కమ్యూనికేషన్ల కుంభకోణమా? షేర్ల కుంభకోణమా? రాష్ట్రంలో జరిగిన ప్రతి అవినీతిపనిలో ఎన్నోకోట్లు దిగమింగారు. నిన్నకాక మొన్న కరువు కొరకు వచ్చిన బియ్యాన్ని కూడా ప్రధాన పార్టీల నాయకులందరూ దిగమింగారు. సుమారు అయిదువేల కోట్ల రూపాయల బియ్యం రాష్ట్రానికి వస్తే, ఎంత బియ్యం స్వచ్ఛందంగా ప్రజలకందించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ప్రతి ప్రజల పైసను సగం వరకు దిగమింగి నేడు స్వచ్ఛమైన పాలన గూర్చి మాట్లాడుతున్నారు.

రైతులకు ఎరువులు, విత్తనాలు, విద్యుత్‌ఛార్జీలకు సబ్సిడీలను ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం ఇండియా సిమెంట్స్‌కు, రామోజీ ఫిలింసిటీ భూమికి, లార్సన్ & టూబ్రో, సత్యం కంప్యూటర్ సంస్థల్లాంటి ఎన్నో సంపన్న వర్గాలకు చెందినవారికి ఎన్నోరకాల సబ్సిడీలందించింది. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా ప్రభుత్వ పనులను పంచుకునే ఎంఎల్‌ఏలు, మంత్రులు, పార్టీప్రముఖులు బహిరంగంగానే ప్రజల ధనాన్ని తేరగా మెక్కుతున్నారు. ఇంతగా అవినీతి జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం

(తరువాయి భాగం 19వ పేజీలో)

కృష్ణా, నల్లగొండ జలవివాదం - ఒక పరిష్కారం

— దిగుమర్తి నరసింహారావు

కృష్ణా డెల్టాలో ఈ వర్షాకాలంలో తగినంత వాన కురియక పోవడం వలన చాలాచోట్ల నాట్లు పడలేదు. వేసిన నారు పశువులకు ఆహారం అవుతున్నది. ఈ ఆపత్సమయంలో కృష్ణా డెల్టాకు నాగార్జున సాగర్ నీరు వదలమని కోరుతున్నారు. నాగార్జునసాగర్ నీళ్ళు కృష్ణా డెల్టాకు వదిలితే నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువకింద వున్న ఆయకట్టు భూములు దెబ్బతింటాయని, నాగార్జునసాగర్ ఆయకట్టు దారులు నాగార్జునసాగర్‌నీరు కృష్ణాడెల్టాకు వదలరాదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందులో డెల్టా రైతుల వాదన కాని, సాగర్ ఆయకట్టు రైతాంగం వాదాన్ని కాని ప్రభుత్వం కొట్టిపారేసే స్థితిలో లేదు. ఇది చాలా మౌలికమైన సమస్య.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 1956లో ప్రారంభించి ఆనకట్ట డామ్ పూర్తిఅవ్వడానికి ఏడు సంవత్సరాలు పట్టింది. కుడి, ఎడమ కాలువలు చాలామట్టుకు త్రవ్వకాలు పూర్తిఅయ్యాయి. కృష్ణాడెల్టాకి నీరు పారించ డానికి 1852-56లో విజయవాడవద్ద ఆనకట్ట నిర్మించబడ్డది. అయితే 1952లో వచ్చిన వరదలవలన ఆ ఆనకట్ట బాగాదెబ్బతింది. అందుచేత తరువాత పాత ఆనకట్టకు దిగువన ప్రకాశం బ్యారేజి నిర్మించడం జరిగింది.

కృష్ణానదిమీద 19వ శతాబ్దం మధ్యలో ఆనకట్టకట్టడం జరిగితే 20వ శతాబ్దం మధ్యలో ప్రథమంగా ప్రకాశం బ్యారేజి, తరువాత మరో దశాబ్దంన్నరకు నాగార్జునసాగర్ డామ్ నిర్మాణం జరిగింది. నాగార్జునసాగర్ కాలువల తవ్వకం 1980 మధ్యవరకు జరిగింది. నాగార్జునసాగర్ కుడి (జవహర్), ఎడమ (లాల్‌బహదూర్‌శాస్త్రి) కాలువలలో నీరు 1960 దశాబ్దం చివరిదశలో ఆయకట్టుకు వదలడం ప్రారంభించారు. కాలువల త్రవ్వకం పొడవు పెరిగిన కొలది ఆ కాలువల క్రిందవున్న ఆయకట్టు విస్తరణ జరిగింది. ఒకప్పుడు ప్రకాశం బ్యారేజి క్రింద గుంటూరు జిల్లాలో వున్న ఆయకట్టుకు నాగార్జునసాగర్ కట్టడం పూర్తిఅయిన తరువాత కొంతభాగానికి నాగార్జునసాగర్ నీరును పారించడం జరుగుతున్నది.

ప్రకాశం బ్యారేజి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కట్టిన తరువాత 2002-2003 సంవత్సరాలలో రాష్ట్రాన్ని ఆవరించిన వర్షాభావం, దుర్భిక్షం గత అర్ధశాతాబ్దంలో ఎప్పుడూ సంభవించలేదు. ఎప్పుడు వర్షాభావం ఏర్పడితే మెట్ట ప్రాంతాల పైరు ఎండిపోవడం, లేక డెల్టాప్రాంతంలో ఏ పదో, పదిహేను శాతంలో పంటలు, ముఖ్యంగా కాలువచివర భూములలో పంటనష్టంకావడం జరగడం అనుభవం. అందుచేత ఈ సంవత్సరం కృష్ణా డెల్టా రైతులు నీరులేక, నాట్లు జరగక కటకటలాడిపోతున్నారు. దానితో ప్రకాశం బ్యారేజికి నాగార్జునసాగర్ నీరువదలాలని ఆందోళనచెలరేగింది. సాధారణంగా సాగర్‌నుంచి కృష్ణానదిలోనికి వదిలిన నీరే ప్రకాశం బ్యారేజి క్రింద వున్న ఆయకట్టుకు సరిపోయేది. నాగార్జునసాగర్‌లో నీరుకూడా అంతంతమాత్రమే వుంది. సాగర్ కాలువల క్రింద వున్న ఆయకట్టు సరిపోయినంత లేకపోవడం వలన సాగర్ రైతులకు, డెల్టా రైతులకు మధ్య గొడవ ప్రారంభం అయ్యింది. ఈ సమస్యను ప్రభుత్వం తగిన సమయంలో చొరవతో పరిష్కరించడానికి ముందుకు రాకపోవడం వలన సమస్యజటిలమైంది. పంతం, పట్టుదలలదాకా పోయి, శాసనసభ్యులు రంగంలోకిదిగి నిరాహారదీక్షలదాకావచ్చింది. ఈ మధ్యనే ప్రభుత్వం అటు డెల్టా రైతులకు, ఇటు సాగర్ రైతుల అవసరాలను కొంతవరకైనా తీర్చడానికి 'రొటేషన్' పద్ధతి ప్రవేశ పెట్టారు. 'రొటేషన్' పద్ధతి అంటే ఒక ముఖ్య పంటకాలువ (డిస్ట్రిబ్యూటరీ) మరో పంటకాల్వకి నీరు వదలడం. సాగర్‌లో నీరు సరిపడినంత వుండాలంటే, ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టులో తగినన్ని నీరుండాలి. కర్ణాటక ప్రాంతంలో ఆలమట్టి డామ్ ఎత్తు పెంచడం వలన శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఇదివరకంత చేరడంలేదు. ఈ నీటిపారుదల కార్యక్రమంలో ఇన్ని జటిలసమస్యలు ఇమిడివున్నాయి. వర్షాకాలంలో పుష్కలంగా వర్షాలు పడితే ఏవిధమైన ఇబ్బంది వుండదు. కాని గతదశాబ్దం వర్షపాతం గణాంకాలు గమనిస్తే ఒక విషయం స్పష్టంగా గోచరిస్తుంది. వాతావరణంలో చాలా మార్పు వలన వర్షాకాలంలో వర్షం ఇంచుమించు సగం సంవత్సరాలకుపైగా దామాషా వర్షంకన్నా తక్కువే పడింది. వాతావరణ శాస్త్రజ్ఞులు 'ఎల్‌నినో' మున్నగు పరిణామాల వలన వాతావరణంలో వస్తున్న మార్పుల వలన వర్షపాతం అంచనాలు తప్పుతున్నాయి అని అంటున్నారు. అంటే వర్షపాతం తగ్గుదల ఒక సంవత్సరం, రెండు సంవత్సరాల విషయం కాదు. అందుచేత వాతావరణంలో కలుగుతున్న మార్పుల దృష్ట్యా ప్రభుత్వం నీటిపారుదల నిపుణులు,

వ్యవసాయ శాస్త్ర నిపుణులు, ప్రజా ప్రతినిధులు, రైతుసంఘాల నాయకులు అందరూ కలిసి, అమలులో వున్న వ్యవసాయ విధానంలో ఎలాంటి మార్పులుచేసి, అన్ని ప్రాంతాల రైతులకు, ఎవ్వరికీ ఇబ్బంది కలుగకుండా పంట సాగుకు తగినంత నీరు సరఫరా అయ్యేలాగున ఒక శాస్త్రీయమైన, అందరికీ ఆమోదయోగ్య మైన విధానాన్ని ఇప్పటినుంచే రూపొందించడం ప్రారంభించాలి.

1960 దశాబ్దంలో రాయలసీమలోనూ, ఇతరచోట్ల దుర్భిక్షం ఏర్పడినప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకులు సుందరయ్యగారు ఒక సూచనచేశారు. అది కృష్ణాడెల్టాలోనూ, ఇంకా ఇతర డెల్టా ప్రాంతాల్లో రైతులు అవసరమైనదానికన్నా ఎక్కువనీరు వినియోగిస్తున్నారని అందుచేత నీటివాడకం తగ్గించాలని అన్నారు. అలా తగ్గిస్తే కాలువ చివర భూములకుకూడా నీరుఅందుతుంది. అంతేకాదు ఈ ప్రాంతాల్లో భూగర్భజలం పుష్కలంగా లభిస్తుంది కాబట్టి, ఉపరితల నీరు, భూగర్భనీరు కలిపి ఒక దామాషాలో వాడాలని సూచించారు (కన్‌జెక్టివ్ యూసేజ్). ఈ విధంగా నీరును పొదుపుచేసి వీలైనంత ఎక్కువ ప్రాంతానికి నీటిపారుదల సౌకర్యం కలిగించాలి. అంతేకాక పంటల విధానంలో కూడా మార్పులు తేవాలి. నీరుంది కదా అని అందరూ ముఖ్యంగా వరినే పండించకుండా, రెండు పంటలు, మూడు పంటలు పండే స్థలంలో నీటిపారుదల సౌకర్యంతో మెట్ట పంటలను పండించాలి. ఈవిధంగా కూడా నీరు పొదుపుచేయవచ్చు. ఈమధ్యన అంటే గత రెండు దశాబ్దాలలోని 'డ్రిప్ ఇరిగేషన్' కూడా వాడుకలోకి వచ్చింది. దీనికి కొంత ప్రభుత్వ పెట్టుబడి ఎక్కువైనా, వాటి ఆదా చాల వుంటుందని అంచనా. ఈ విధానం ఇజ్రాయిల్, ఇంకా ఐరోపా దేశాలలో విరివిగా వాడకంలో వుంది. అందుచేత "కన్‌జెక్టివ్ యూజ్", "ఇరిగేటెడ్ డ్రై", "డ్రిప్ ఇరిగేషన్" విధానాలు. ఏఏ ప్రాంతంలో ఏది అమలుచేయవచ్చు, ఏది ఆర్థికంగా తక్కువ ఖర్చు ఎంచుకొని, రాష్ట్రం అంతటికీ ఒకే నీటిపారుదల విధానాన్ని రూపొందించుకొని దానిని అమలుచేయడానికి ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల యాజమాన్యాన్ని ఏర్పాటుచేయాలి. ఈ యాజమాన్యంలో ఇప్పటి "వాటర్ యూజర్సు ఎసోసియేషన్స్" (నీటి వాడకందార్ల సంఘాలు) మోస్తరుగా వివిధ ప్రాజెక్టులకు కాని, వివిధ ప్రాంతాలకు కాని, పంటకాలువలకు కాని రైతు, నీటిపారుదలశాఖ ప్రతినిధులతో ఏర్పాటుచేయాలి. ఈవిధంగా ఇప్పటినుంచే ప్రయత్నాలు ప్రారంభించాలి. ఈ విధానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయపరంగా రావలసిన నీరు ఉపయోగానికి వర్తిస్తుంది.

అయితే ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గోదావరి, తుంగభద్ర, పెన్నా, వంశధార అంతర్‌రాష్ట్ర నదులు. ఇవికాక శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో కొన్ని నదులు ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోంచి ప్రవహిస్తున్నాయి. ఇలాంటి అంతర్‌రాష్ట్ర నదులు నీటిలో, ఏ రాష్ట్రానికి ఎంతనీరు రావాలి అన్నది తేల్చడానికి కొన్ని సూత్రాలు అంతర్జాతీయంగా అమలులో వున్నాయి. అందులో మొదటిసూత్రం రైపేరియన్ రాష్ట్రాలకు అంటే కొత్త ప్రాజెక్టులు కట్టకముందు ఆ నదినీటిని ఉపయోగించి పంటలు పండించుకొని రైతులకు కావలసిన నీరును వారికి ప్రత్యేకించిన తరువాతే మిగతానీరును పంచుకోవాలి. ఈవిషయంలో రాష్ట్రంలో నదిపారే ప్రాంతంలో ఆ రాష్ట్రంలో పడిన వర్షాలు ఎంత ప్రాంతం నుంచి వర్షంనీరు ఆ నదికి అందుతుందో ఆ ప్రాంతం దామాషా బట్టి వాటిని ఆ రాష్ట్రానికి కేటాయించాలి. ఆ కేటాయించిన నీరు ఆ రాష్ట్రం దాని ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకోవచ్చు. అయితే ప్రాజెక్టులు కట్టినప్పుడు దిగువ రాష్ట్రానికి కేటాయించిన నీరు సజావుగా ప్రవహించేందుకు ఏవిధమైన ఆటంకాలు కలుగకుండా చూడాలి. ఐరోపా ఖండంలో డాన్యుబు నది వివిధ దేశాలగుండా ప్రవహిస్తున్నది. అన్నిదేశాల ఎటువంటి పొరపచ్చకాలు లేకుండా నదినీరును ఉపయోగించుకుంటున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రంలో మిసిసిపి మున్నగు నదులు పలు రాష్ట్రాలగుండా ప్రవహిస్తున్నాయి. ఆ రాష్ట్రాలు కూడా ఏవిధమైన వివాదాలు లేకుండా ఆ నదుల నీరును ఉపయోగించుకుంటున్నాయి.

1975లో కృష్ణా, గోదావరి నదీజలాలను, ఆ నదులు ప్రవహించే మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు పై సూత్రాలను ఆధారం చేసుకొని నదిలో నీరు ఎంత ప్రవహిస్తున్నదో అంచనావేసి, ఆంధ్రప్రదేశ్‌కు ఇంచుమించు 800 శతకోటి ఘనపు అడుగులు, కర్నాటకకు 700 శతకోటి ఘనపుఅడుగులు, మహారాష్ట్రకు 400 శతకోటిఘనపు అడుగుల కృష్ణానీరును కేటాయించడం జరిగింది. కృష్ణాలో అంచనా వేసిన నీరుకన్నా అదనపు నీరు ప్రవహిస్తే దానిని ఆంధ్రప్రదేశ్ అమలులో వున్న ప్రాజెక్టుల ద్వారా వాడుకోవచ్చునని బచావత్ అవార్డు నిర్ణయించింది.

ఈ అదనపు నీరు వృధాఅవ్వకుండా, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజి మధ్యన నల్లగొండ జిల్లాలోని పులిచింతలవద్ద ఒక ప్రాజెక్టు నిర్మిస్తే, ఇంచుమించు కృష్ణాడెల్టాలో అవసరమయ్యే నీరు ఈ ప్రాజెక్టు నుండి అందించవచ్చు. అపుడు నాగార్జునసాగర్ నీరు కొంత ఆదా అవుతుంది. దానివలన నాగార్జునసాగర్ ఎడమకాలువ క్రింద

భూములకు మరింత నీరు అందించవచ్చు. అయితే పులిచింతల ప్రాజెక్టు వదిలి నల్లగొండజిల్లాలో నాలుగైదు గ్రామాలు మునిగి పోవచ్చు. కాని మిగిలిన గ్రామాలకు కలిగే నష్టం కన్నా, ప్రాజెక్టువలన కలిగే లాభం ఎక్కువ కాబట్టి, దెబ్బతిన్న రైతు, ప్రజలకు ప్రభుత్వం పునరావాస ఏర్పాట్లుచేసి, నష్టపరిహారం చెల్లించాలి. అంతేకాదు పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం వద్ద ప్రాజెక్టు నిర్మించి, వృధాగా పోతున్న గోదావరినది నీటిని నాగార్జునసాగర్‌లో కలిసేటట్లు డైవర్షన్ డ్యామ్ కట్టి 80 శతకోటి ఘనపు అడుగులు కాని అంతకన్నా ఎక్కువ నీటిని కాని గోదావరినదిని కృష్ణాలోకి మళ్ళించవచ్చు. ఈ పోలవరం ప్రాజెక్టుకు 1980లోనే అప్పటి ముఖ్యమంత్రి హయాంలో పునాది వేయడం జరిగింది. అలాగే పులుచింతల ప్రాజెక్టుకింకా అనుమతి కొరకు కేంద్రప్రభుత్వానికి, రాష్ట్రప్రభుత్వం పంపించి రెండుదశాబ్దాలు కావస్తున్నది. రెండుప్రాజెక్టులు అనుకున్నవిధంగా పూర్తిచేస్తే, కృష్ణాడెల్టా రైతులకు, నాగార్జానసాగర్ డెల్టాలకు మధ్య వివాదాలు వచ్చేవికావు.

కృష్ణా డెల్టా రైతుల ఇబ్బందులు ప్రకృతి వైపరీత్యాల వలన కలిగినవి. అందుచేత కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనం పొందడానికి డెల్టా ప్రాంతానికి సంబంధించిన శాసనసభ్యులు ఆందోళన భావ్యం కాదు. అందుకు బదులు అందిన నీరును ఎలా పొదుపుచేసి, డెల్టాలోని అన్నిప్రాంతాలు ఒకేవిధంగా లాభం పొందేటట్లు, అన్నిప్రాంతాలు ఒకేవిధంగా లాభంపొందేటట్లు, అన్నిప్రాంతాలు ఒకేవిధంగా నష్టపోయేటట్లు పంచుకునే ప్రతి పాదనలు ఆలోచించాలి. అంతేకాని ఎగువ ప్రాంతాల వాళ్ళు వారికి అవసరమున్న నీరును వాడుకుంటాం, కాలువచివర ప్రాంతాలవారు నీరు ఏమైనా పటించుకోం అని ఆలోచించరాదు. అలాగే నాగార్జున సాగర్ ఆయకట్టుదార్లు కూడా కృష్ణాడెల్టా రైతులపై కొంత సానుభూతి చూపించి, నీరును ఐ.డి. పంటలు డ్రిప్ ఇరిగేషన్ మున్నగు విధానాల ద్వారా పొదుపుచేసి, కృష్ణాడెల్టాకు నీటిపారుదల కనీస అవసరాలకు సరిపడే నీరును వదలడానికి అంగీకరించాలి. ❍

(16వ పేజీ తరువాయి)

అవినీతి లేదంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నది. గత ఎనిమిదేళ్ళుగా జాతీయంగా, అంతర్జాతీయంగా ఒక్క పరిశ్రమను నెలకొల్పించలేక పోయిన ప్రభుత్వం ఇపుడు ఫార్ములా వన్‌మీద ప్రజలను భ్రమింప చేస్తున్నది. గతంలో ఎన్నో సెమినార్‌లు, మీటింగ్‌లు, ప్రదర్శనలు పెట్టి ఎం.ఓ.యు.(మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్)లకే ఇదిగో కోట్లు రాష్ట్రానికి వస్తున్నాయి. అదిగో కోట్లు వచ్చేశాయన్న ప్రభుత్వం నేడు ఇటలీలో ఆ సంస్థలకు చెందిన వారితో మాట్లాడితేనే రాష్ట్రానికి అది వచ్చేసిందని అక్కడ చంద్రబాబు, ఇక్కడ ఆయన తాబేదార్లు (మంత్రులు) ప్రజలను ఫార్ములా వన్ మత్తులో ముంచి కృష్ణాయాదవ్ ఘనకార్యాన్ని మరపించే ప్రయత్నం చేయుచున్నారు.

ఈవిధంగా రాష్ట్రాలలో ప్రజల సొమ్మును తేరగా మెక్కేస్తూ, ఈ ధనం చాలక కాంట్రాక్టులు, పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ ఏజెన్సీలు, కేంద్రంలో వేలాదికోట్ల రూపాయల ఆస్తులు కలిగిన ప్రభుత్వరంగ సంస్థలను వందలాది కోట్లకు బహుళజాతి సంస్థలకు, సంపన్న వర్గాలకు అమ్ముతున్న ప్రభుత్వ పెద్దలు ఇందులో వస్తున్న కమీషన్లు చాలక దొంగనోట్లు, దొంగస్టాంపులు, కల్తీవ్యాపారాలు, భూకబ్జాలకు పాల్పడుతూ భారత ప్రజాస్వామికవ్యవస్థను క్షీణదశలోకి తీసుకువెళ్తూ, మరొకవైపు ప్రపంచంలోని పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా, తమ సమస్యల కొరకు పోరాడుతున్నవారు ఈ వ్యవస్థ వ్యతిరేకులుగా ముద్రవేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. కాని, "కొందరిని ఎల్లకాలం, అందరిని కొంతకాలం భ్రమింపచేస్తారే తప్ప ఎల్లకాలం అందిరిని మోసం ఎలా చేయగలర"ని ఆలోచించి ప్రజాస్వామ్య పరిపుష్టతకు, నల్లచట్టాలకు వ్యతిరేకంగా, దేశంలోని రాజకీయపార్టీల అవినీతికి వ్యతిరేకంగా సమరశంఖం పూరించవలసిన సమయం ఆసన్నమైంది. ❍

జాతీయ భద్రతకు, పుష్కలంగా విద్యుదుత్పత్తికి యురేనియం అవసరమా?

— కెప్టెన్ జె. రామారావు

ప్రపంచంలో ఎక్కడా అణుబాంబులుండకూడదనేది భారత విదేశాంగ, రక్షణవిధానంగా వుంటూవచ్చింది. చదివేస్తే ఉన్న మతి కూడా పోయిందన్నట్లు ఆ పాట పాడిపాడి, ఇపుడు దేశరక్షణకు, భద్రతకు అణుబాంబు అవసరమని, అందుచేత యురేనియం నిక్షేపాల తవ్వకాలు అవసరమనే స్థాయికి దిగజారాం. అలాగే విద్యుదుత్పత్తికి బొగ్గునిక్షేపాలు దేశంలో పరిమితంగా వున్నాయని, అందుచేత ప్రత్యామ్నాయ ఇంధన వనరులు అవసరం కాబట్టి, విద్యుదుత్పత్తికి యురేనియం తవ్వకాలు అవసరమనే వాదన వింటున్నాం. ఇలా తవ్వకాలు జరిగినపుడు, అలాగే ఏదైనా భారీ ప్రాజెక్టులు చేబట్టినపుడు కొంతమందికి ఇబ్బందులు తప్పవనే వాదన కూడా వినవడుతుంది. జాతీయ భద్రతకు, పుష్కలంగా విద్యుదుత్పత్తికి యురేనియం తవ్వకాలు విధిగా చేపట్టాల్సిందేనన్న వాదనలను విశ్లేషిద్దాం. మొదట విద్యుదుత్పాదన విషయంతీసుకుంటే ప్రస్తుతం దేశంలో అణుశక్తి ద్వారా విద్యుదుత్పాదన 2700 మె.వా.గా వుంది. వచ్చే 10 నుంచి 20 సంవత్సరాల్లో దేశంలో విద్యుచ్ఛక్తి స్థాపకశక్తి రెండులక్షల మెగావాట్లలక్ష్యాన్ని చేరుకోవటంలో భాగంగా అణు విద్యుచ్ఛక్తి వాటా ఇరవైవేల మెగావాట్లకు చేరుకోవటం అవసరమా? ఆర్థికాభివృద్ధికి విద్యుచ్ఛక్తి అవసరాన్ని ఎవరూ కాదన లేరు. కాని విద్యుదుత్పత్తి లక్ష్యం చేరుకోవడానికి 20 వేల మె.వా. అణువిద్యుత్తు అవసరమా? అణువిద్యుత్తు కమీషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ సుదీర్ఘ భవిష్యత్తులో విద్యుత్ భద్రత అవసరం దృష్ట్యా యురేనియం ఉపయోగించాలని అంటున్నారు. మరొక విచిత్ర వాదన కూడా ఇతర శాస్త్రవేత్తలు ముందుకు తెస్తున్నారు.

ప్రపంచజనాభాలో మనదేశజనాభా ఆరోవంతు వుంది కాబట్టి, ప్రపంచ విద్యుదుత్పత్తిలో కూడా ఆరోవంతు కావాలని, అందుచేత యురేనియం అవసరమని అంటారు. ప్రపంచంలో 17 శాతం జనాభాగల దేశం మూడుశాతం విద్యుచ్ఛక్తిని వినియోగిస్తున్నాం. అందుచేత ప్రత్యామ్నాయ వనరులు అవసరం అని భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రసలహాదారుని అభిప్రాయం. వాళ్ళలాజిక్కులు విడ్డూరంగా వున్నాయి. ఈ లాజిక్‌ను కొంచెం పొడిగిస్తే, ప్రపంచ జనాభాలో మనదేశ జనాభా 17 శాతం కాబట్టి, ప్రపంచ తాగునీటి వనరుల్లో కూడా మనకు 17 శాతం వుండాలి. కాని మనకు లభిస్తున్నది నాలుగు శాతమే. నాలుగు శాతాన్ని 17 శాతానికి పెంచటం గురించి ఈ సైంటిస్టులు ఎందుకు ఆలోచించరు? 17 శాతం జనాభా వుంది కాబట్టి 17 శాతం విద్యుచ్ఛక్తి అవసరం అనటం అంటే 17 శాతం విద్యుదుత్పత్తి చేయాలనడమే. మనకు కావాల్సింది విద్యుదుత్పత్తి పెరగటమా? విద్యుచ్ఛక్తి అందించే సేవలా? ఆ సేవల్లో దేశాభివృద్ధికి అవసరమైనవి ఎన్ని? అవసరం లేనివెన్ని? దేశాభివృద్ధికి అవసరం లేకున్నా, విచ్చలవిడిగా విద్యుత్‌ను కొంతమంది లాభాలకు, విలాసాలకు వినియోగించుకోవడం కోసం, యురేనియం తవ్వకాలు చేపట్టి, వేల, లక్షలమంది ప్రజల ఆరోగ్యాలను బలిపెట్టడం అవసరమా? థర్మల్‌విద్యుత్‌కన్నా అణువిద్యుత్ ఉత్పత్తి ఖర్చు రెట్టింపు వుంది. ఎవరి విలాసాల కోసం రెట్టింపుఖర్చు చేయాలి? అదీకాక, భారతదేశం లాంటి దేశంలో వేలకోట్లు ఖర్చుచేసి అణువిద్యుత్ కేంద్రాలు నెలకొల్పేదానికన్నా, అదిచిందించే కాలుష్యాన్ని భరించే దానికన్నా చిన్నచిన్న విద్యుత్ కేంద్రాలను, స్థానికంగా లభించే ఇంధనాల ఆధారంగా నెలకొల్పడం ద్వారా విద్యుదుత్పత్తిని పెంచుకోవచ్చు. ఇంతకూ వచ్చే 10, 20 సంవత్సరాల్లో అణుఇంధనంతో విద్యుదుత్పత్తి లక్ష్యం 20 వేల మెగావాట్లు. ఈ 20 వేల మెగావాట్ల విద్యుచ్ఛక్తిని పైసాఖర్చు లేకుండా రవాణా, పంపిణీలో జరుగుతున్న వృధాను కేవలం 10 శాతం తగ్గించుకుంటే లక్ష్యం నెరవేరుతుంది కదా. ఇంత చిన్నపరిష్కారం అంత పెద్దతలకాయలకు ఎందుకుతోచలేదో?

అణుశక్తితో విద్యుదుత్పత్తి చేస్తే కాలుష్యం సమస్య వుండనే వుండదనేది మరో వాదన. విద్యుదుత్పత్తి కేంద్రం వద్ద కాలుష్యం ఉండకపోవచ్చు కాని, దానికి కావాల్సిన యురేనియం తవ్వకాలవద్ద, తవ్వకాలు జరిగినపుడు, ఆ తర్వాత 80 వేల సంవత్సరాల వరకూ కాలుష్యం కలుగచేసే విషపూరిత పరిణామాలతో బతకాల్సి వుంటుందనే విషయం మరిచిపోతున్నారు. బొగ్గునిక్షేపాలు తరిగి పోతున్నాయి కాబట్టి ప్రత్యామ్నాయంగా అణువిద్యుత్ ఒక్కటే పరిష్కారం అంటున్నారు. హైడెల్ విద్యుచ్ఛక్తి, గాలిమరలతో విద్యుచ్ఛక్తి, సూర్యరశ్మితో విద్యుచ్ఛక్తి-ఇలాంటి ప్రత్యామ్నాయాలను మనం పెంపొందించలేదా? అవి ప్రత్యామ్నాయాలు కావా?

ఇక దేశ భద్రతకు యురేనియం తవ్వకాలు అవసరమనే వాదనను పరిశీలిద్దాం. ఆసియాలో మొట్టమొదటగా అణు కార్యక్రమాలకు నాందిపలికింది భారతదేశమే. ఆసియాలో మొదటిసారిగా పోఖ్రాన్‌లో అణుపరీక్ష చేసిందీ భారతదేశమే. దేశ రక్షణ దృష్ట్యా ఈ అణ్వాయుధాలు రూపొందించుకోవటం అవసరం. ఇదీ ప్రభుత్వ వాదన. పీకలదాకా అణ్వాయుధాలను సమకూర్చుకున్న అమెరికా సెప్టెంబర్ 9/11 దాడినుంచి రక్షించుకోగలిగిందా? పోటీగా అదే

(తరువాయి భాగం 22వ పేజీలో)

వినదగునెవ్వరు చెప్పిన...

"**ప్రస్తుతం** ప్రపంచ వాణిజ్యసంస్థ అనుమతించిన సబ్సిడీ 10 శాతం అయితే భారతదేశం మొత్తం ఉత్పత్తి వ్యయంలో రైతులకిస్తున్న సబ్సిడీలు రెండు శాతమే"

– ప్రపంచ బ్యాంకు సీనియర్ ఆర్థికవేత్త డొమినిక్ మెన్స్‌బర్గ్

"**1998** భారత్‌లో నాలుగువేలమంది ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతి లక్షమందిలో 11 మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ప్రతి ఆరునిమిషాలకొక ఆత్మహత్య నమోదవుతుంది."

– భారత ప్రైవేట్ సైకియాట్రి అసోసియేషన్ అధ్యక్షుడు డా॥ ఎన్.కె.బోహ్రా

"**ప్రపంచీకరణ,** స్వేచ్ఛా వాణిజ్యం కారణంగా స్వయం నిర్ణయాధికార వ్యవస్థ నుండి ప్రపంచ పాలనవైపు మళ్ళుతుండడం ఆందోళన కలిగిస్తుంది. డబ్ల్యు.టి.ఓ. మంచినీరు, విద్యుత్తు, విద్య, వైద్యం వంటి అత్యవసరసర్వీసులను ప్రైవేటీకరణవైపు నెట్టివేసి స్థానిక ప్రభుత్వాలను పూర్తిగా వ్యాపార సంస్థలుగా మార్చివేస్తుంది. డబ్బు సంపాదనే లక్ష్యంగా కలిగిన కార్పొరేట్ సంస్థలు పేదలు పీల్చేగాలికి కూడా ముందుముందు రేటును నిర్ణయించే ప్రమాదముంది"

– గ్లోబల్ పాల్సీ డైరెక్టర్ జేమ్స్

"**తమకు విధించిన** శిక్షను పూర్తిగా అనుభవించిన తరువాత కూడా భారతీయ జైళ్ళలో మగ్గుతున్న పాకిస్తానీ ఖైదీలను విడుదల చేయకుండా వారిని పొరుగుదేశంతో బేరసారాలకు పావులుగా ఉపయోగించుకోవడం సమంజసంకాదు. వారినివిడుదలచేయాలనే కోర్టుతీర్పును ప్రభుత్వం పట్టించుకోకపోవడం నేరం. బెస్ట్ బేకరీ కేసులో రాజకీయ జోక్యాన్ని నివారించకుండా గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం న్యాయవ్యవస్థనే అప్రతిష్టపాలు చేసింది"

– భారత ఆటార్నీ జనరల్ సోలీ సొరాబ్జీ

"**పోలీసు కస్టడీలో** వ్యక్తులను ఇంటరాగేషన్ పేర చిత్రహింసలు పెడుతున్న ఘటనలు పెచ్చుపెరుగుతున్నాయి. నాగరిక సమాజంలో ఇలాంటి మానవ హక్కుల ఉల్లంఘన నేరాలు జరగడం అత్యంత చెడ్డది. వ్యక్తులను కస్టడీలో శారీరకంగా బాధపెట్టడం అన్నది రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన మౌలిక హక్కులకు భంగకరం ఇది వారి హుందాతనాన్ని అగౌరవపరుస్తుంది"

– జస్టిస్ దొరైస్వామిరాజు, జస్టిస్ అరిజిత్ పసాయత్ (సుప్రీం)

"**రాష్ట్ర ప్రభుత్వం** అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం బాలలనుపాఠశాలలకురప్పించడానికి ప్రోత్సాహకంగా మారకూడదు, అది బాలలకు ఒక హక్కుగా ప్రభుత్వం వర్తింపచేయాలి."

– రామన్ మెగసేసే అవార్డు గ్రహీత ప్రొ॥ ఎం. శాంతాసిన్హా

"**అరాఫత్** బహిష్కరణ అంతర్జాతీయచట్టాలకు పూర్తిగా విరుద్ధం. పాలస్తీనా ప్రజల్ని, తద్వారా అంతర్జాతీయ సమాజాన్ని అవమానపరిచినట్టే"

– ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారి విజయ్ నంబియార్

"**మీకు** ప్రాసిక్యూషన్‌పై, గుజరాత్ ప్రభుత్వంపై నమ్మకం లేదు. దానర్థం 356 అధికరణాన్ని ప్రయోగించమని కాదు. నేరస్థులను శిక్షించి ప్రజలను కాపాడటం మీబాధ్యత. రాజధర్మమంటే ఇంతకంటే వేరొకటి కాదు. ప్రజాస్వామ్యం అంటే నచ్చినవారిని వదిలేయడం కాదు. నేరస్థులను విచారించలేకపోతే గద్దె దిగు"

– గుజరాత్ ప్రభుత్వాన్నుద్దేశించి సుప్రీంకోర్టు

"**భారతీయ జనతాపార్టీ** మతోన్మాద విధానాలను అన్ని రంగాల్లోనూ అమలుచేస్తూ లౌకిక, ప్రజాస్వామ్యాలకు పెనుముప్పు తీసుకొస్తుంది"

– భారత మానవవాద సంఘం అధ్యక్షుడు వి.ఎం. తార్కుండే

"**కెల్లీ** ఆత్మహత్యకుకారణమైన బ్రిటన్‌ప్రధాని బ్లెయిర్ రాజీనామా చేసి తీరాల్సిందే"

– 'మెయిల్ ఆన్ సన్‌డే' సర్వేలో ప్రజాభిప్రాయం

"**రాజ్యాంగ** నిర్దేశాలకు భిన్నంగా ప్రభుత్వ చర్యలు ఉంటే రాజ్యాంగ ధర్మాసనాలైన సుప్రీంకోర్టు, హైకోర్టులు కళ్ళుమూసుకుని చూస్తూ ఊరుకోవు. ప్రభుత్వ బాధ్యతలను గుర్తుచేసే అధికారం కోర్టులకు ఉంది."

– రామచంద్రరావు (సీనియర్ న్యాయవాది, హైకోర్టు)

"**హత్యకేసులో** నిందితుడిగాఉన్న వ్యక్తి మంత్రివర్గంలోసభ్యుడిగా కొనసాగడం ఎంతవరకు సమంజసమో ప్రజాప్రతినిధులు సమాధాన మివ్వడం అత్యవసరం"

– తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి రామసుబ్బారెడ్డినుద్దేశించి హైకోర్టు వ్యాఖ్య

"**స్త్రీ పురుష** నిష్పత్తిలో అసమానతలకు కారణమైన లింగ నిర్ధారణ పరీక్షలను నిర్వహించే అల్ట్రా సౌండ్ డయాగ్నస్టిక్ కేంద్రాల కార్యకలాపాలను పర్యవేక్షించాలి"

– సుప్రీంకోర్టు

ప్రపంచశాంతి రక్షణకు సంబంధించి ఏకపక్ష నిర్ణయాలు ఎవరు తీసుకున్నా ఐక్యరాజ్యసమితి నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. ఇరాక్‌లో సైనికచర్య చేపట్టడం వంటి ఏకపక్ష నిర్ణయాలను తీసుకోవడం వల్ల గడిచిన 58 ఏళ్ళనుంచి ఉన్న శాంతి సుస్థిరతలు ప్రపంచానికి దూరమవుతున్నాయి.

– కోఫీ అన్నన్ (ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి)

'కాంగ్రెస్ వేసిన ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదు ప్రజలకే జవాబు చెబుతాం' ముఖ్యమంత్రి

– 90 మంది కాంగ్రెస్ సభ్యులను ఎన్నుకున్నవాళ్ళు ప్రజలు కారా?

'ఫార్ములా నెంబర్‌వన్ వస్తే మనమే నెంబర్‌వన్' ముఖ్యమంత్రి

– స్కాముల్లో నెంబర్‌వన్ సాధించారుగా. చాలు బాబూ ఈ నెంబర్ వన్లు

'స్కామ్‌లో 1999లో కేసు నమోదుకాగా 41 మందిని అరెస్టు చేశాం, మా పార్టీకి చెందిన మాజీమంత్రి కృష్ణాయాదవ్‌ను నిర్దాక్షిణ్యంగా పార్టీనుంచి వెలివేశాం'–ముఖ్యమంత్రి సమర్థన

– అయిదు సంవత్సరాలు పట్టిందా? ప్రభుత్వం నిద్రపోతుందా? నిద్ర నటిస్తుందా?

'చట్టసభల నుంచి నేరగాళ్ళ వెలి' ముఖ్యమంత్రి

– నేరచరితుల జాబితాను 1999 ఎన్నికలముందే జయప్రకాశ్ నారాయణ్ ప్రభుత్వానికి పంపారు. ఎంతమందిని వెలివేశారు?

'అయోధ్య ఉద్యమాన్ని మళ్లీ ప్రారంభించండి చూద్దాం' – ములాయం

– బస్తీమే సవాల్

'వరంగల్ జైలులో ఖైదీ ఆత్మహత్య' జైలు సూపరింటెండెంట్

– ఇదేమైనా కొత్త విషయమా?

'బెస్ట్ బేకరీ కేసులో మోడీకి సుప్రీం చివాట్లు' వార్త

– ఆయన చర్మం చాలా దళసరిలెండి

'బాబు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చెయ్యాలి' కాంగ్రెస్

– అటు మోడీ, ఇటు చంద్రబాబుది ఒకటే కులం. ఇంకో ముగ్గురు సి.ఎం.లు చేరితే ఎంచక్కా ముఖ్యమంత్రుల ట్రేడ్ యూనియన్ పెట్టుకోవచ్చు

'ఇంటింటికీ తెలుగుదేశం ప్రజల బాధలు తెలుసుకుందామనే' – ముఖ్యమంత్రి

– అదేమిటి? రాజశేఖర్‌రెడ్డి ఈ పనేచేస్తే ఎద్దేవా చేశారుగా?

'స్టాంప్ పేపర్ల కుంభకోణంలో కృష్ణాయాదవ్ తప్ప ఇతర రాజకీయ నాయకులెవరూ లేరని మహారాష్ట్ర డి.జి.పి. నాతో చెప్పారు' ముఖ్యమంత్రి

– మరి పాలేటి రామారావు రాజకీయ నాయకుడు కాదా? అబద్ధం ఆడుతున్నదెవరు?

'గాలి, నీరు ప్రతి ప్రాణికి అవసరం" ఒక పత్రిక శీర్షిక

– కాదు, హైటెక్ భవనాలు, స్పోర్ట్సు స్టేడియంలు, కార్ల రేసులు ప్రతి ప్రాణికి అవసరం.

'హైదరాబాద్‌లో పట్టుకెళ్ళారు, ముంబాయిలో చంపారు' ముంబాయి బాంబు పేలుళ్ళ ప్రధాన నిందితుడి గురించిన వార్త

– చంద్రబాబు రూట్‌లో మహారాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందన్నమాట.

'రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం పెంచుకోవడానికి అధికారులకు లక్ష్యాలు నిర్ణయించిన చంద్రబాబు ప్రభుత్వం నకిలీ స్టాంపుల గురించి పట్టించుకోలేదు' – వార్త

– 'పట్టించుకోబట్టే కోటాలు ఇస్తే నకిలీ స్టాంపులు ఎక్కువగా అమ్ముడు పోతాయి. తమ్ముడి ఆదాయం పెరుగుతుంది.

కృష్ణాయాదవ్ తప్ప మరెవ్వరూ లేరు' ముఖ్యమంత్రి

– మరెవ్వరైనా ఉంటే చర్య తీసుకోరా.

'సమాచార హక్కు బిల్లు అవసరం లేదు' మంత్రిమండలి

– ఉదయం నుంచి రాత్రివరకు 365 రోజులు ముఖ్యమంత్రి స్వయంగా టి.వి.లో తన ఉపన్యాసాలద్వారా కావాల్సినంతసమాచారం అందిస్తున్నారుగా.

(20వ పేజీ తరువాయి)

రక్షణ, భద్రత పేరుతో అణ్వాయుధాలను సమకూర్చుకున్న సోవియట్ యూనియన్ అంతర్ధానమైపోలేదూ? పొరుగున వున్న పాకిస్తాన్‌కూడా అణ్వాయుధాలను రూపొందించుకుంది. దురదృష్టవశాత్తు ఇటు మనదేశంగాని, అటు పాకిస్తాన్ గాని యుద్ధంవచ్చి అణ్వాయుధాలను ప్రయోగించుకుంటే, మొత్తంగా రెండుదేశాలూ నాశనమవుతాయి. అణ్వాయుధ ప్రయోగాల పరిణామాలు దేశాల సరిహద్దులను పాటించవు. ప్రపంచంలో ఏఇతరదేశమూ వాళ్ళవాళ్ళస్వప్రయోజనాల దృష్ట్యా మనదేశంమీద అణుబాంబు ప్రయోగించబోదు. 100 కోట్ల ప్రజల మార్కెట్‌ను బహుళజాతి సంస్థలు చేతులారా నాశనం చేసుకోవు. మరలాంటప్పుడు అణ్వాయుధాల తయారీ ఎవరినుంచి భద్రత కోసం?

భద్రత కావాల్సింది భారత ప్రజలకు. దారిద్ర్యం, అనారోగ్యం, అవిద్య, నిరుద్యోగంనుంచి వారికి భద్రత కావాలి, దేశానికి శతృవులు ఇవే. ఈ శతృవులను సంహరించడానికి ఆటంబాంబులు అవసరం లేదు. ఆ బాంబుల తయారీకిచేసే ఖర్చుతో, ఈ శతృవులను తరిమి కొట్టవచ్చు. అదే జరిగితే, దేశప్రజలే దేశాన్ని రక్షించుకుంటారు. ○

(7వ పేజీ తరువాయి)

21 శాతం మాత్రమే కేటాయించడం జరిగింది. అంటే ఉపాధిని ఇతోధికంగా కల్పించగలవని ఆశించిన రంగాలకు పెట్టుబడుల కేటాయింపులలో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నమాట. మరి ఇలాంటి పరిస్థితులలో ఉపాధికల్పన అనేది ఒక అభూతకల్పనే కదా!

జి.డి.పి.ఆధారిత ఉపాధికల్పన కాకుండా ప్రత్యేక కార్యక్రమాలను (స్పెషల్ ప్రోగ్రామ్స్) రూపొందించడం ద్వారా ఉపాధికల్పన చేయాలన్నది మరో అంశం. కానీ పదో పంచవర్ష ప్రణాళికలో అలాంటి చర్యలేవీ ప్రతిపాదించినట్లు దాఖలాలు లేవు.

ఆశ్చర్యకరమైన విషయమేమంటే, ఏ రంగాలైతే ప్రపంచీకరణ వల్ల విషమస్థితిలో వున్నాయో, ఆ రంగాలే ఉపాధిని ఇతోధికంగా కల్పిస్తాయని నమ్మడం, ప్రజలను నమ్మించడం పాలకుల (అ)సమర్థతకు నిలువుటద్దం!

కొసమెరుపేమిటంటే ఉపాధికల్పన అటుంచి, తరిగిపోతున్న ఉపాధిలో ఆర్థికంగా వెనుకబడినవారికి ఉపాధిలో రిజర్వేషన్ కల్పిస్తామని వాగ్దానాలుకురిపించడం మనరాజకీయనాయకులకే చెల్లు. ○

సత్యశోధన వృధాప్రయాసేనా?

— ఎన్. వేణుగోపాల్

వంగవీటి మోహనరంగారావు హత్యపై విచారణను సిబిఐ జరపాలా, సిబిసిఐడి జరపాలా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జరపాలా అని ఎడతెగని వివాదం కొనసాగుతోంది. ఎవరిమానానవాళ్ళు ఆయా విచారణ సంస్థల బాగోగులు అతిశయోక్తులుగా ప్రకటిస్తున్నారు.

వివాదానికి మూలమూ, లక్ష్యమూ వివాదమే అయినప్పుడు సాధారణంగా ముఖ్యమైన అంశాలన్నీ తెరమరుగైపోతాయి. ఎవరి విచారణ సత్యాన్ని సమగ్రంగా వెలికితేగలుగుతుంది అనే అంశం మీద వివాదం రేగుతున్నదంటేనే ఆయా విచారణ సంస్థలన్నీ తమ సాధికారతను కోల్పోయాయన్నమాట.

ఐతే మన సామాజిక, రాజకీయసంస్థలు తమతమ సాధికారతను కోల్పోయాయన్నది కొత్త విషయం కాదు. ఏ రంగంలో ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలన్నీ కూడా మన చట్టబద్ధ పాలనా సంస్థలన్నింటినీ నిర్వీర్యంచేసివేశాయి. ఆధునిక ప్రజాస్వామ్యపాలనకు మూడు మూల స్తంభాలుగా చెప్పుకునే శాసనాధికార వ్యవస్థ, కార్యనిర్వహణా వ్యవస్థ, న్యాయవ్యవస్థ మూడు కూడా తమతమ స్థాయిల్లో సాధికారతను పోగొట్టుకుని, అశక్త సంస్థలుగా ప్రజల సంక్షేమం పట్ల అసహాయతను ప్రకటిస్తూనే వున్నాయి.

ఇప్పుడు చెలరేగుతున్న వివాదం కార్యనిర్వహణా వ్యవస్థలోని ఒక అంగానికి సంబంధించినది.

మామూలుగా పోలీసువ్యవస్థకు శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతతో పాటే నేరపరిశోధన బాధ్యత కూడా ఉంటుంది. పోలీసు అధికారులు నేరపరిశోధన చేసి న్యాయస్థానాల్లో నేరారోపణ చేయాలి. న్యాయస్థానం ఆ ఆరోపణపై వాదప్రతివాదనలు విని తీర్పు ఇవ్వవలసి ఉంటుంది.

ఐతే, శాంతిభద్రతలను పరిరక్షించటంలో పోలీసులు విఫలమై నందువల్లనే ఒకనేరం జరిగిందని భావించినప్పుడు ఆ నేరపరిశోధన బాధ్యతను మళ్ళీ ఆ పోలీసులకే ఇవ్వడం సాధ్యంకాదు. అట్లాగే పోలీసులే నేరం చేశారని ఆరోపణ వచ్చినప్పుడు కూడా నేరపరిశోధన బాధ్యతను పోలీసులకు ఇవ్వడం కుదరదు.

ఇటువంటి పరిస్థితులలో నేరపరిశోధనబాధ్యతను ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థకు ఇవ్వాలనే ఆలోచన సహజంగానే వచ్చింది. పోలీసు యంత్రాంగంలో భాగాలే అయి కొంత స్వతంత్ర ప్రతిపత్తిగల సిబిసిఐడి, సిబిఐ లాంటి సంస్థలు ఏర్పడ్డాయి. ఇవి మొత్తంమీద హోమ్‌శాఖ ఆధిపత్యంలోనే వుంటాయి.

మరోవైపు ప్రజాజీవితంలో ప్రముఖ స్థానాలలో ఉన్న వ్యక్తులపై నేరారోపణలు వచ్చినప్పుడు న్యాయమూర్తుల చేత విచారణ జరిపించాలని 1952 కమిషన్‌ఆఫ్‌ఎంక్వైరీ ఆక్ట్ ఆదేశించింది. అట్లాగే విధినిర్వహణలో భాగంగా పోలీసులపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లకు అధికారాలు సంక్రమించాయి.

పైకి చూడడానికి ఇన్నిరకాల విచారణా పరిశోధనా అంగాలు ఉన్నట్లు కనిపించినప్పటికీ సమీప గతంలోంచే కొన్ని ఉదాహరణలు చూస్తే ఈ అన్ని అంగాలు సత్యశోధనలో ఎలా విఫలమవుతున్నాయో అర్థమవుతుంది.

డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ అనేది ఎప్పుడూ నిందితుడికన్నా పై అధికారే చేస్తాడు గనుక ఆ శాఖ ప్రతిష్టని కాపాడుకోవటం తన బాధ్యతగా ఆ అధికారి భావిస్తాడు గనుక ఇటువంటి విచారణలో తేలేదేమీ ఉండదు. నిజానికి ఇటువంటి సందర్భంలో విచారణ అనేది జరగడం చాలా అరుదు.

మెజిస్టీరియల్ ఎంక్వైరీ విషయం చూస్తే ఇది బహిరంగ విచారణే గాని దీని నివేదికను బహిరంగంగా ప్రకటించనక్కర లేదు. ఆర్‌డివోస్థాయి అధికారి లేదా అంతకన్నా పై జిల్లా అధికారి ఎప్పుడు ఎక్కడ విచారణ జరుపుతాడో బహిరంగంగా ప్రకటించి విచారణజరుపుతారు కాని నివేదికను సంబంధిత సచివాలయం శాఖకు పంపుతారు. చర్య సంబంధిత శాఖే తీసుకోవాలనే నియమం ఉంటుంది. కనుక మెజిస్టీరియల్ ఎంక్వైరీలో ఏమి నిర్ధారణ జరిగిందో ఎవరికీ తెలిసే అవకాశం లేదు.

సిబిసిఐడి విచారణలో ఆ శాఖనుంచి డిఎస్‌పి స్థాయిగల అధికారి సంబంధిత వ్యక్తులందరినీ విడివిడిగా కలిసి తన పైఅధికారికి (సాధారణంగా ఐజికి) నివేదిక సమర్పిస్తారు. ఈ నివేదిక కూడా బహిరంగ నివేదిక కాదు గనుక అందులో ఏమి ఉన్నదో ప్రజలకు తెలిసే అవకాశం లేదు.

1985 సెప్టెంబరు 2 సాయంత్రం కాజీపేట రైల్వేస్టేషన్‌లో యాదగిరిరెడ్డి అనే సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను ఎవరో కాల్చిచంపారు. మర్నాడు ఉదయం ఆయన శవాన్ని ఊరేగింపుగా తీసుకువెళుతున్నప్పుడు ఆ ఊరేగింపులోంచి కొందరు వెళ్ళి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షుడు, శిశువైద్యుడు డాక్టర్ రామనాధంను కాల్చిచంపారు. డాక్టర్ రామనాధంను పోలీసులే కాల్చిచంపారని పౌరహక్కుల

సంఘం నుంచి ఆమ్నెస్టీ ఇంటర్‌నేషనల్ వరకూ అనేక సంస్థలు ఆరోపించాయి. ఈ హత్యను పరిశోధించే బాధ్యతను ప్రభుత్వం సిబిసిఐడికి అప్పగించింది. ఇప్పటివరకు ఆ నివేదిక వెలువడలేదు.

ఇక సిబిఐ విచారణ విషయానికి వస్తే ఈ విచారణలో కూడా ఒక అధికారుల బృందం సంబంధిత వ్యక్తులను కలిసి విచారణ జరుపుతుంది. నివేదికలోని ప్రధానాంశాలను సిబిఐ ప్రధానాధికారి బయటపెట్టదలచుకుంటే పెట్టవచ్చును.

ఫెయిర్‌ఫాక్స్‌ను వినియోగించి భారతీయుల విదేశీ ఖాతాలను పరిశోధించారనే ఆరోపణపైన సయ్యద్‌మోడీహత్యపైన సిబిఐ జరిపిన పరిశోధనలు ఇంకా ప్రజల జ్ఞాపకం నుంచి చెరిగిపోయి వుండవు. ఈ రెండుసందర్భాలలోను రాజకీయప్రయోజనాలను సాధించేందుకు విచారణసంస్థలను వాడుకున్నారని విస్తృతంగా ఆరోపణలు వచ్చాయి. సిబిఐ ప్రకటించిన నివేదికలోని అంశాలు ఆ అంశాల ఆధారంగా న్యాయస్థానాలలో నమోదైన కేసులు ఈ ఆరోపణలను బలపరుస్తున్నాయి.

చాలాకాలంగా ప్రజాస్వామిక ఉద్యమపు కోర్కెలతో ఒకటిగా న్యాయమూర్తిచేత విచారణజరిపించాలనేది ఉంటూఉండేది. మిగిలిన పరిశోధన సంస్థలన్నీ సాధికారతను కోల్పోయినపుడు న్యాయవ్యవస్థ చివరి ఆశగా కనబడడం సహజమే.

ఐతే ఈ న్యాయవిచారణలో కూడా నిష్ప్రయోజనకరమైనవిగా పరిణమించడం ఒక దశాబ్దంగా జరుగుతూవస్తోంది. ఎమర్జెన్సీ అత్యాచారాల మీద దేశవ్యాప్తంగా సమగ్రమైన విచారణ జరిపిన షా కమిషన్ నివేదికపై జనతా ప్రభుత్వం ఏ చర్యా తీసుకోకముందే కూలిపోయింది ఎమర్జెన్సీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లపై విచారణ జరపడానికి ఏర్పడిన భార్గవా కమీషన్ అర్ధాంతరంగా విచారణను ఆపవలసి వచ్చింది.

కాగా రాజీవ్‌గాంధీ అధికారానికి వచ్చిన తరువాత 1952 విచారణ సంఘాల చట్టానికి చేసిన సవరణలతో విచారణ సంఘం నివేదికను పార్లమెంటులో గాని, శాసనసభలో గాని బహిరంగంగా ప్రజలముందు వుంచాలనే నిబంధన రద్దు అయిపోయింది. ఇక న్యాయవిచారణ జరిపించడం, జరిపిస్తున్నామని ప్రకటించడం ఒక వేళాకోళంగా మారిపోయాయి.

ఇందిరాగాంధీ హత్యపై విచారణ జరిపిన థక్కర్ కమీషన్ నివేదిక ఇంతవరకు వెలుగుచూడలేదు. సిక్కులపై ఢిల్లీలో జరిగిన దమనకాండను విచారించిన రంగనాథ మిశ్రా కమిషన్ నివేదికలోనుంచి కొన్నిభాగాలే వెలుగులోకివచ్చాయి. వాటిఆధారంగా కూడా సరైన చర్యలు తీసుకోవడం జరగలేదు.

చీటికీమాటికీ కేంద్రప్రభుత్వాన్ని విమర్శించే ఎన్.టి.రామారావు ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం అక్షరాలాకేంద్రంఅడుగుజాడల్లోనే నడుస్తోంది. ప్రతి లాకప్ మరణంపైనా న్యాయవిచారణ జరుపుతానని ప్రకటించిన ముఖ్యమంత్రి కొద్దిరోజుల్లోనే ఆ వాగ్దానాన్ని మరచిపోయారు. ప్రఖ్యాతమైన మురళీధరన్ లాకప్ హత్యను విచారించిన రంగనాయకులు కమిషన్ నిర్ధారణలను శాసనసభలో ప్రవేశపెట్టి కూడా, కమిషన్‌నిర్ధారించినదోషులపై చర్యతీసుకోలేదు. తెలుగుదేశం ప్రభుత్వం నియమించిన కమిషన్ల సంఖ్యను, వాటి నివేదికలను, ఆ నివేదికల సిఫార్సుల అమలును పరిశీలిస్తే ప్రభుత్వపు చిత్తశుద్ధి ఎంత అనుమానాస్పదంగా ఉందో తెలుస్తుంది.

ఈ విచారణసంఘాలలో పరిశోధనలలోఉన్న మరొక ఇబ్బంది మన శిక్షాస్మృతికి సంబంధించినది. మన శిక్షాస్మృతిప్రకారం క్రిమినల్ నేరారోపణ అధికారం ప్రాసిక్యూషన్‌కు మాత్రమేఉంటుంది. ఈ విచారణ సంఘాలన్నీ కూడా కేవలం నిజనిర్ధారణ సంఘాలే. వీటి విచారణలో తేలిన అంశాలమీద ప్రాసిక్యూషన్‌వారు కేసు నమోదు చేయాలి. సిబిసిఐడి, సిబిఐలు కూడా ప్రాసిక్యూషన్‌లా వ్యవహరించవచ్చును.

కాని బాధితులకు, నిందితులకు స్పష్టమైన విభజనరేఖ ఉన్న దగ్గర ఏ విచారణ సంస్థ అయినా ఎంత నిష్పక్షపాతంగా ఉండగలుగుతుందనే ప్రశ్న ఉండనేఉంది.

మొత్తంమీద తేలేదేమంటే ఇవాళ విచారించవలసిందీ, పరిశోధించవలసిందీ మన పాలనాకార్యనిర్వహణ వ్యవస్థలలో ప్రవేశించిన చీడగురించి. ఈ చీడ కొనసాగి పాలనాధికారానికి సంబంధించిన ఏ ఒక్క అంగం కూడా గౌరవించదగినది కాదని ప్రజలు అనుకుంటే జరిగే పరిణామాలకు బాధ్యులు ఎవరు?

సత్యం సుందరమైనదే కాదు అప్పుడప్పుడు భయంకరమైనదిగా కూడా ఉంటుంది. సత్యశోధన నిజనిర్ధారణ కఠోరపరిశ్రమమీదగాని సాధించిలేని విజయాలు అలాసాధించిన సత్యం సూర్యప్రకాశంలాగ, చంద్రకాంతిలాగ అజరామరంగా ఉంటుంది. క్షుద్ర తాత్కాలిక ప్రయోజనాల కోసం సమస్త విలువలను, సంస్కృతిని తాకట్టుపెట్టే ఇవాళ్టి ప్రపంచంలో అజరామర సత్యాల కోసం అన్వేషించడం, నిజాన్ని నిజంగా కనిపెట్టే సంస్థల కోసం వెతకడం మృగతృష్ణేనేమో!

(ఆంధ్రపత్రిక, సోమవారం జనవరి 23, 1989)

Designed & Printed at : Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad.
Edited and Published by **V. Hanumantha Rao** for **Samata Publications** D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-73. Ph: 23748672